Rni Title Code No. TELTEL02115

## రాష్ట్ర తలసరి ఆదాయం 2.75 లక్షలు

హైదరాబాద్ : అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెడుతోంది. ఏటా వృద్ధిని నమోదు చేస్తోంది. వ్యవసాయం, పారిశ్రామిక, ఉత్పత్తి, వాణిజ్యం, రవాణా, రియల్ ఎస్టేట్ రంగాలు రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ)కి ఊతమిస్తున్నాయి. ఫలితంగా 2021-22లో రాష్ట్రం ఏకంగా 19.4 వృద్ధిని నమోదు చేసింది. దేశాభివృద్ధికి.. దేశ జీడీపీలో 4.9 మేర వాటాను అందిస్తోంది. జీఎస్‌డీపీ వృద్ధిపరంగా దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఏడో స్థానంలో నిలిచింది. ఈమేరకు రాష్ట్ర అర్థ గణాంక సంచాలకుల కార్యాలయం తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ -2022 నివేదికను విడుదల చేసింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఈ నివేదికను ఆవిష్కరించారు. రాష్ట్ర జనాభా, భౌగోళిక, మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్థితిగతులు, పాఠశాల విద్య, వాతావరణ పరిస్థితులు, వ్యవసాయం, పశు సంవర్ధకం, సాగునీటి పారుదల, రైతు బంధు, రైతుబీమా, పరిశ్రమలు, ఆరోగ్యం, గ్రామీణ తాగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం, పల్లె ప్రగతి-పట్టణ ప్రగతి, సామాజిక భద్రత వంటి 16 అంశాలకు సంబంధించిన వివరాలను ఈ నివేదికలో వెల్లడించారు.

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

## మహిళల లీగ్‌లో అదానీ, అంబానీ

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జట్ల వేలం బీసీసీఐకు ఊహించని రీతిలో కాసుల వర్షం కురిపించింది. ఆరంభ లీగ్‌లో ఐదు జట్ల అమ్మకానికిగానూ బోర్డుకు రూ. 4669.99 కోట్ల ఆదాయం సమకూరింది. లీగ్‌ను ప్రకటించినప్పటి నుంచే కార్పొరేట్ కంపెనీలు ఫ్రాంచైజీలను దక్కించు కొనేందుకు ఉత్సాహం కనబర్చడంతో.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లో ఐపీఎల్ తర్వాత అ'ధర' హో అనిపించింది. బిగ్‌బాష్ లీగ్, హండ్రెడ్ లీగ్ సహా ఏ దేశవాళీ లీగ్ కూడా డబ్ల్యూపీఎల్‌కు దరిదా పుల్లో కూడా లేకపోవడం విశేషం. ముంబైలో ఐదు జట్లు అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, లఖ్‌నవూలకు సంబంధించిన బిడ్‌లను బీసీసీఐ ఖరారు చేసింది. మొత్తం 17 బిడ్‌లు దాఖలైనట్టు బోర్డు తెలిపింది.

సంపుటి : 1 సంచిక : 65 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 మార్చి 2023 మంగళవారం పేజీలు : 4

# ఇన్వెస్ట్‌మెంట్లు కేరాఫ్ తెలంగాణ

## 150 శాతం వృద్ధి: అనూహ్యంగా..!!




హైదరాబాద్ : తెలంగాణకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పెట్టుబడుల్లోనేగాక.. ఉద్యోగావకాశాల్లోనూ తెలంగాణలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. 2020-21తో పోల్చితే 150 శాతం వృద్ధి సాధించినట్లు ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ నివేదికలో వెల్లడించింది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించటంతో పాటుగా కీలక రంగాల్లో సాధించిన పురోగతిని నివేదికలో స్పష్టం చేసారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా రాష్టంలో 17.53 లక్షల ఉద్యోగాలు లభించాయి. పెట్టుబడులకు తెలంగాణ చిరునామాగా మారుతోంది. 'ఇన్వెస్ట్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ' అంశంపై ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఓ అధ్యయనం చేసింది. ఇందులో గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు లక్ష కోట్ల రూపాయలపైగా ఉన్నట్లు నిర్ధారించారు. 2020-21తో చూస్తే 2021-22లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల విలువ సుమారు 150 శాతం పెరగాయని నివేదిక తేల్చింది. 2014-15తో పోల్చితే 2021-22లో రాష్ట ఐటీ ఎగుమతులూ రెట్టింపు అయ్యాయని వివరించారు. 2020-21లో రూ. 31,274.56 కోట్ల విలువైన ప్రతిపాదనలు రాగా.. 2021-22 సంవత్సరంలో రూ. 76,568.89 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఇన్వెస్టర్లకు అనువైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొంది. పరిశ్రమలకు కావాల్సిన ప్రోత్సాహం..మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటు సత్ఫలిలు ఇస్తోందని నివేదిక స్పష్టం చేస్తోంది. వైద్య రంగంలోనూ తెలంగాణ మెరుగైన ప్రగతిని కనబరుస్తున్నది. 2 లక్షల మంది వైద్య చికిత్స కోసం తెలంగాణకు వచ్చినట్టుగా నివేదిక వెల్లడించింది. వీరిలో ఎక్కువగా ఆఫ్రికా, గల్ఫ్ దేశాలు, కామన్‌వెల్త్ ఇండిపెండెంట్ దేశాల నుంచి వస్తున్నట్టుగా గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చెయిన్, క్లౌడ్ అడాప్షన్, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్తు ఉన్న అంశాల్లో తెలంగాణ ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా నిలిచిందని ఎంఎస్‌ఎంఈ ఈపీసీ చైర్మన్ డీఎస్ రావత్ పేర్కొన్నారు. -22లో ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు భారీగా పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ. 14,882.35 కోట్ల నుంచి రూ. 60,618.05 కోట్లకు చేరుకున్నట్లుగా నివేదిక వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత ఇప్పటి వరకు వచ్చిన పెట్టబడులు..ఉపాధి కల్పన గురించి నివేదిక కీలక అంశాలను వెల్లడించింది. దేశ జీడీపీ 1.4 శాతం క్షీణతను చూసిన సమయంలో తెలంగాణలో ప్రతికూల పరిస్థితులను అధిగమంచి రాష్ట్ర జీడీపీ 2.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రం.. పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రపంచంలోని టాప్-5 ఐటీ కంపెనీలు అమెరికా తరువాత తమ ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఐటీ ఎగుమతులు 2014-15లో రూ. 66,276 కోట్ల నుంచి 2021-22లో రూ. 1,45,522 కోట్లకు రెట్టింపు అయ్యాయి. 2014-15లో ఉపాధి 3.71 లక్షల నుండి 2021-22 నాటికి ఐటీ రంగంలో 7 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు కూడా 2020-21 ఆర్థిక సంవత్సరంలో 12.4 శాతం వృద్ధి చెందగా.. 2021-22లో 9.09 శాతం వృద్ధిని సాధించాయి. ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్, పాలసీ సపోర్టు వల్ల ఇది సాధ్యమైందని నివేదిక వివరించింది.

# బండికొక రూలు కవితకు ఒక రూలా ?



హైదరాబాద్ : బీజేపీ చీఫ్ బండి సంజయ్ కు ఒక రూలు కల్వకుంట్ల కవితకు మరో రూలు ఉన్నట్లుంది. దర్యాప్తు సంస్థలు విచారణకు రమ్మని పిలిచినపుడు వ్యక్తిగతంగా వెళ్ళాల్సిందే తప్ప ప్రతినిధులనో లేకపోతే లీగల్ బృందాన్నో పంపుతామంటే కుదరదు. కవిత విషయంలో జరిగిందిదే. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో మొదటిసారి విచారణకు హాజరైన కవిత రెండోసారి లీగల్ టీమును పంపితే విచారణకు ఈడీ నిరాకరించింది. వ్యక్తిగతంగా విచారణకు రమ్మని తాము నోటీసులు ఇచ్చినపుడు కవిత హాజరుకావాల్సిందే అని ఈడీ స్పష్టంగా చెప్పింది. సీన్ కట్ చేస్తే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విచారణకు రమ్మని నోటీసులు ఇస్తే బండి సంజయ్ తన లీగల్ టీములను పంపుతున్నట్లు కబురుచేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నాటకలోని బీదర్ కు వెళుతున్నట్లు బండి సమాచారం అందించారు. తనకు బదులుగా తన లీగల్ టీము విచారణకు హాజరవుతుందని చెప్పారు. మరి బండి సమాధానంతో సిట్ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే కేంద్రప్రభుత్వం స్థాయిలో దర్యాప్తు సంస్థలు ఎలా పనిచేస్తాయో రాష్ట్రప్రభుత్వంలో దర్యాప్తు సంస్థలు కూడా అలాగే పనిచేస్తాయి. సీబీఐ ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలకు ఎలాంటి అధికారాలు ఉంటాయో ఇంచుమించు రాష్ట్రప్రభుత్వం పరిధిలో పనిచేసే సీఐడీకి కూడా అలాంటి అధికారాలే ఉంటాయి. అవసరమైనపుడు కేసుల తీవ్రతను బట్టి ప్రభుత్వం ప్రత్యేకంగా సిట్ ను నియమిస్తుంది. ఈ సిట్ కు కూడా దాదాపు ఇలాంటి అధికారాలే ఉంటాయి. అలాంటిది విచారణకు రమ్మంటే రాకుండా లీగల్ టీమును పంపుతానని బండి చెప్పటమే ఆశ్చర్యంగా ఉంది. కవితను విచారణకు హాజరవ్వాల్సిందే అని ఈడీ ఎంతగా పట్టుబట్టిందో అందరికీ తెలిసిందే. మరి బండి మాత్రం మినహాయింపు కోసం ప్రయత్నం చేయటం ఏమిటి ? ఈడీ దర్యాప్తుకు కవిత హాజరుకావాల్సిందే అని బండి నానా రచ్చచేశారు. అలాంటిది విచారణకు రమ్మని సిట్ నోటీసులు ఇస్తే తాను మాత్రం హాజరుకాకుండా తప్పించుకుంటున్న బండిని ఏ విధంగా అర్థంచేసుకోవాలి.



## వాస్తవాలను వక్రీకరించడం కేంద్ర హోంమంత్రి స్థాయికి తగదు: మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న మహారాష్ట్ర వాసులను ఎందుకు గుర్తించలేదని కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. వాస్తవాలను వక్రీకరించడం కేంద్ర హోంమంత్రి స్థాయికి తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో దళితబంధు పథకంలో భాగంగా మంజూరైన రైస్ మిల్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. లబ్దిదారులను రైస్ మిల్ యూనిట్ స్థాపన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనతరం మాట్లాడుతూ.. రైస్‌మిల్‌ను స్థాపించాలనుకోవడం గొప్పనిర్ణయమన్నారు. రైస్‌మిల్ యూనిట్ విజయవంతంగా నడవాలని, రాష్ట్రం మొత్తానికి ఇది ఆదర్శంగా నిలవాలని చెప్పారు. మిగతా లబ్దిదారులకు కేస్ స్టడీగా మారాలని ఆకాంక్షించారు. సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న మహారాష్ట్ర వాసులను ఎందుకు గుర్తించలేదని కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సంగా జరిపామన్నారు. విమోచన దినంగా ఎందుకు జరపట్లేదని కొందరు అడుగుతున్నారని.. ఆగస్టు 15ను స్వాతంత్ర దినోత్సవంగా ఎందుకు జరుపుకుంటున్నామని ప్రశ్నించారు. త్యాగాలు, పోరాటాలను గౌరవప్రదంగా స్మరించుకోవడం ముఖ్యమని సూచించారు. పాత ఖైదీగా వ్యవహరించడం మాని.. భవిష్యత్ నిర్మాణంపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

# టార్గెట్ మోదీ!

## ఇదే అస్త్రంతో జనాల్లోకి కేసీఆర్!!




హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికలకు మరో ఆరు మాసాల సమయం మాత్రమే ఉంది. నవంబరు-డిసెంబరు మధ్యలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. సెంటిమెంటును ప్రధానా స్త్రంగా ప్రచారాస్త్రంగా మలుచుకుని.. ముందుకు సాగడంలోనూ.. ప్రజలను తనవైపు తిప్పుకోవడంలోనూ కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారనేది అందరికీ తెలిసిందే. 2014 ఎన్నికల్లో తెలంగాణ తెచ్చిన యోధుడిగా.. తనను తాను చిత్రీకరించుకోవడంలో కేసీఆర్ సఫలీకృత మయ్యారు. 2018 ముందస్తు ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును అడ్డు పెట్టుకుని సెంటిమెంటును పేల్చి.. గెలుపు గుర్రం ఎక్కారు. రెండు సార్లు పాలనతో జాతీయ స్థాయిలో ఇప్పుడు చక్రం తిప్పాలని నిర్ణయించుకున్నారు. ఇదిలావుంటే.. ఎంతైనా.. రెండు సార్లు వరుసగా అధికారం ఇచ్చిన ప్రజలు.. ఇప్పుడేమనుకుంటున్నారు? అనేది ప్రశ్న.


దీనిని గమనిస్తే.. ప్రతిపక్షాల జోరు పెరిగింది. వారు చేస్తున్న పాదయాత్రల హవా కూడా ఓ రేంజ్లో ఉంది. మరోవైపు.. నియామకాలు చేపడుతున్నా.. కుటుంబ పాలన సాగిస్తున్నారనే మధ్యతరగతి వాదన ఎలానూ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. ఈ దఫా ఎలాంటి సెంటిమెంటూ లేకపోతే.. కేసీఆర్ గెలుపు కొంత ప్రశ్నార్థకమే అవుతుందనే అంచనాలు వస్తున్నాయి. అయితే.. అందని వరంగా ఇప్పుడు మోడీనే కేసీఆర్కు సెంటిమెంటు అస్త్రంగా మారుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. రాష్ట్రానికి రుణ సదుపాయం కల్పించకపోవడం రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా అమలు చేయకపోవడం.. విభజన చట్టంలోని అంశాలను ఇప్పటికీ పట్టాలెక్కించకపోవడం వంటివాటిని.. కేసీఆర్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఇదేసమయంలో ఇప్పుడు లిక్కర్ స్కాం.. తన కుమార్తెకు సమన్లు వంటి అంశాలను కూడా కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా వాడుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అదేవిధంగా ఎమ్మెల్యేల కొనుగోలు కేసును కూడా తమకు అనుకూలంగా మార్చుకుని.. ఈ దఫా.. "ఢిల్లీ దండయాత్రను ఒప్పుకొందామా? వారి అరాచకాలను భరిద్దామా?" అనే నినాదాన్ని.. కేసీఆర్ వినిపించి.. ప్రజలను మరోసారి తన వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తారని.. అంటున్నారు పరిశీలకులు.

# సంపాదకీయం

## విషాన్ని మింగేస్తున్నారు... విషాదమే..?

హైదరాబాద్ ని భాగ్యనగరం అని అంతా పిలుస్తారు. సౌభాగ్యాలకు అది పెట్టింది పేరు. ఈ నగరానికి వచ్చిన వారు ఆకలి కేక ఏమిటో ఎరగరు. ఏదో ఒక ఉపాధి వారికి ఇక్కడ దక్కుతుంది. మెల్లగా కోటి దాకా హైదరాబాద్ జనాభా ఈ రోజుకు చేరింది అంటే గొప్పతనం ఏంటో తెలుస్తుంది. ప్రపంచ లోని వందకు పైగా దేశాల కంటే కూడా హైదరాబాద్ జనాభా ఎక్కువ. ఇక పాలకులు హైదరాబాద్ ని చూసి గర్విస్తూంటారు. నాలుగు వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ నగరం విశ్వ నగరం ఖ్యాతిని గడించింది. ఎన్నో కీలకమైన రంగాలు ఇక్కడ స్థిరపడ్డాయి. భవిష్యత్తు సైతం ఎవరూ ఊహించలేనంతగా ఎదిగే అవకాశం ఉంది. అలాంటి మహా నగరం ఇపుడు మత్తులో జోగుతోంది. హైదరాబాద్ లో పబ్ కల్చర్ పెరిగింది. యువత వీటిని తమ నాగరికతగా భావిస్తున్నారు. వీకెండ్స్ పార్టీలు అన్నీ పబ్స్ లోనే జరుగుతున్నాయి. డ్రగ్స్ అక్కడ విచ్చలవిడిగా సరఫరా అవుతోంది అన్న ఆరోపణలు ఉన్నా నిఘా తూతూమంత్రంగా ఉంది. గోవా నుంచి నేరుగా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలు భాగ్యనగరానికి రవాణా అవుతున్నాయని వార్తలు వస్తున్నాయి. డ్రగ్స్ బిజినెస్ కి కూడా హైదరాబాద్ అది పెద్ద మార్కెట్ గా మారుతోంది అన్న ప్రచారం చూస్తే భయం వేసేలా ఉంది. ఈ మధ్యనే ఒక ఇంజనీరింగ్ విద్యార్థి డ్రగ్స్ కి బానిస అయి పచ్చీస్ వయసు చూడకుండానే తన బతుకు అంధకారం చేసుకుని చావుని వరించాడు. డ్రగ్స్ ఇపుడు పెద్ద వర్గాలు సంపన్నులకే కాకుండా కాలేజీ పిల్లల దాకా వ్యాపించడం కలవరపెట్టే పరిణామంగా చూడాలి. తాజాగా ఒక పబ్ లో జరిగిన దాడిలో ప్రముఖుల పిల్లలతో సహా వందకు పైగా పోలీసులకు చిక్కారు. దీంతో అందరి ఆలోచనలు చర్చలు హైదరాబాద్ కి ఏమైంది అన్న దాని మీదకు మళ్ళింది. వీకెండ్స్ అంటే పబ్స్ వైపు దారి తీస్తున్న యువతను ఎలా దారికి తేవాలి అన్న సందేహాలు కూడా అందరిలోనూ కలుగుతున్నాయి. ఈ డ్రగ్ కల్చర్ ముందు తాగుడు చాలా సాధారణ వ్యసనం అయింది. సిగరెట్టు తాగేవారిని అసలు పట్టించుకోకూడదు అన్నట్లుగా పరిస్థితి ఉంది. అంటే ఈ మత్తు మహమ్మారి ఎంతలా యువత మెదళ్లలోకి పోయి పొగపెట్టేస్తోందో అర్ధమవుతోంది కదా. ప్రభుత్వాలు అయితే డ్రగ్స్ ఫ్రీ సిటీస్ అని అంటున్నాయి. అంతే కాదు ఎక్కడ చూసినా దాడులు చేయమని ఆదేశాలు ఇస్తున్నాయి. తీరా నిఘా పెట్టి ఎంతో కొంతమందిని అదుపులో తీసుకున్నా ఆ తరువాత వారి పలుకుబడిని చూసి వదిలేయాల్సి వస్తోంది. మరో వైపు చూస్తే డ్రగ్స్ కల్చర్ బాగా పాకిపోయింది అన్నదైతే అర్ధమవుతున్న వాతావరణం ఉంది. తాజాగా బంజారాహిల్స్ లో రాడిసన్ హొటల్లోని ఫుడింక్ అండ్ మింక్ పబ్ లో ప్రముఖుల పిల్లలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులలో దొరికిపోవడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ పబ్ లో డ్రగ్స్ యధేచ్ఛగా వినిమయం అవుతోందని కూడా ప్రచారంలో ఉంది. అయితే ఇప్పటివరకూ పబ్బుల్లో డ్రగ్స్ దొరుకుతుందని వినడమే ఈసారి రెడ్ హ్యాండెడ్గా దొరకడంతో ఇది అధికారులకు పెను సవాల్ గానే చూడాలి. హైదరాబాద్ విస్తరిస్తున్న నగరం. బహుళ జాతి సంస్థలు ఇక్కడకు వస్తాయి. అలాగే ఐటీ దాని ఆధారిత కంపెనీలు కూడా పెద్ద ఎత్తున ఇక్కడ ఉంటాయి. దాదాపుగా రెండు వేల కంపెనీలు ఇలా ఉంటాయి. వాటిలో అయిదు లక్షల మంది పని చేస్తారని ఒక లెక్క ఉంది. వీరిలో చాలా మంది వీకెండ్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. పని వత్తిడి నుంచి విరామం పేరిట పబ్స్ కి వస్తున్న వారు మెల్లగా డ్రగ్స్ కి కూడా అలవాటు పడుతున్నారు అన్నదే ఇపుడు ఆందోళన పెట్టే విషయం. దీనికి అంతం లేదా ఈ కల్చర్ ని తరిమికొట్టలేమా అంటే చిత్తశుద్ధి ఇక్కడ ప్రధానం. అయితే విదేశీ సంస్థలకు ఇలాంటివి ఒక కల్చర్ అయిన వేళ అక్కడ పనిచేసే వారూ అలవాటు పడుతున్నారు. మరి అభివృద్ధి కోసం కంపెనీలను ఆహ్వానిస్తున్న వారు ఈ మత్తును కూడా కోరకుండానే ఆహ్వానించాల్సి వస్తోంది. మొత్తానికి ఒక్క మాట అయితే చెప్పుకోవాలి. ఇది విష సంస్కృతి. ఇది మెల్లగా పాకి సమాజానికి చీడగా తయారవుతోంది. టూ త్రీ టైర్ సిటీలకు ఇపుడే వ్యాపిస్తోంది. దీన్ని ఏదో రకంగా తుదముట్టించకపోతే బంగారం లాంటి యువత బతుకు బుగ్గిపాలు కాక తప్పదు. అపుడు విశ్వనగరం పేరుని విష నగరంగా చెప్పుకున్నా ఆశ్చర్యం లేదు.

# పైసల్ రాలే!





రంగారెడ్డి : రైతులు పండించిన వరి ధాన్యాన్ని తూకం వేసిన 48గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. ఆరుగాలం శ్రమించి వరి పంట సాగు చేయగా... చేతికొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే నెలరోజులైనా రైతుల ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదు. గ్రామాల్లో ఐకేపీ, ఏఎంసీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఎఫ్ఎసీఎస్ ద్వారా జిల్లాలో 41 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 9,949 మంది రైతుల నుంచి రూ. 86.21కోట్లు విలువ చేసే 43,989.640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటివరకు రూ. 80.98 కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ. 5.23 కోట్లు చెల్లించాల్సి ఉంది. డబ్బుల కోసం రైతులు నిరీక్షణ తప్పడం లేదు.

అకౌంట్ ఫీడింగ్‌లో తప్పులుధాన్యం సేకరణ కేంద్రాల్లో రైతులకు చెల్లించాల్సిన డబ్బు పెండింగ్ లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరిగిందని చెబుతున్నారు. కానీ.. జిల్లా వ్యాప్తంగా 41 కొనుగోలు కేంద్రాల్లో రూ. 5.23 కోట్లు బకాయిలు చూపిస్తున్నాయి. రైతుల బ్యాంకు అకౌంట్ ఖాతా నెంబర్లు ఫీడ్ చేసే సమయంలో చాలావరకు తప్పులు దొర్లాయని తెలుస్తోంది. అధికారుల తప్పిదంతో చాలామంది రైతులకు డబ్బు జమ కావడం లేదు. కొన్నది కొంతే..ప్రభుత్వ నియంత్రిత సాగు విధానం అమలులోకి తీసుకువచ్చింది. దీంతో వరి సాగు లక్ష్యాన్ని 45,575 ఎకరాలుగా నిర్ణయించారు. కానీ.. రైతులు లక్ష్యాన్ని మించి రెట్టిపు స్థాయిలో వరి సాగు చేశారు. జిల్లాలో 1,29,215 ఎకరాలు వరి సాగు చేయగా.. దానికి అనుగుణంగా 1.70 మెట్రిక్ టన్నులు ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ.. అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. 43,989 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

ధాన్యం డబ్బుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నా.. రెండెకరాల పొలంలో వరి పంట సాగు చేశాను. ఈసారి 53 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 2021 డిసెంబర్ 24న సర్దార్‌నగర్ మార్కెట్ యార్డ్‌లోని ఐకేపీ సెంటర్‌లో వరి ధ్యానం అమ్మాను. ఇంతవరకు డబ్బు రాలేదు. డబ్బు కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నాను. ఎవరూ పట్టిం చుకోవడం లేదు. అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు త్వరగా ఖాతాలో జమ చేయాలి. – సాయమొళ్ల నర్సింహులు, అప్పారెడ్డిగూడ, షాబాద్ మండలం

ధాన్యం కొనుగోలు, చెల్లింపుల వివరాలువరి సాగు లక్ష్యం : 45,575 ఎకరాలుసాగు చేసింది : 1,29,215 ఎకరాలుధాన్యం సేకరణ లక్ష్యం : 1.70 మెట్రిక్ టన్నులుసేకరించింది : 43,989.640 టన్నులుకొనుగోలు చేసిన వడ్ల విలువ : రూ. 86.21 కోట్లు రైతుల సంఖ్య : 9,949రైతులకు చెల్లించిన డబ్బులు : రూ. 80.98 కోట్లుఇంకా చెల్లించాల్సినవి : రూ. 5.23 కోట్లుధాన్యం కొనుగోలు కేంద్రాలు : 41మద్దతు ధర (క్వింటాకు) : రూ. 1,960

# మళ్లీ బయోమెట్రిక్..




రంగారెడ్డి : రేషన్ దుకాణాల్లో ఓటీపీ విధానంతో సరుకులు పంపిణీ చేసే విధానాన్ని పౌరసరఫరాల శాఖ ఎత్తేసింది. ఇకపై బయోమెట్రిక్‌తోనే రేషన్ పంపిణీ చేసే విధానం అమల్లోకి తీసుకు రావాలని నిర్ణయించింది. రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ–పాస్ యంత్రంపై వేలి ముద్ర వేస్తేనే సరఫరా చేసేలా ప్రభుత్వం అప్పట్లో బయో మెట్రిక్ విధానం అమల్లోకి తీసుకు వచ్చింది. కరోనా కష్టకాలంలో కొవిడ్ వ్యాప్తి జరగకుండా ఉండేందుకు రెండేళ్ల కిందట సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకునేందుకు పౌర సరఫరాల శాఖ అవకాశం కల్పించింది. బయో మెట్రిక్ విధానంలో తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సి రావడంతో కొవిడ్ సమయంలో వైరస్ వ్యాప్తి మరింత విస్తరించే అవకాశం ఉందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందికి ప్రమాణీకరించే (అథెంటికేషన్) అధికారం కల్పించింది. కార్డుదారుల స్థానంలో ఒకరే వేలి ముద్ర వేసే వి?ధానం అమలు చేశారు. ఆ తరువాత కనుపాపను స్కానింగ్ చేసే ఐరిష్ విధానం, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ నెంబర్ చెబితే రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. కొవిడ్ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులు ప్రతినెలా దుకాణాలకు క్యూ కడుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, ఓటీపీ విధానంలో రేషన్ బియ్యం దుర్వినియోగమవుతున్నాయనేది కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో తేలింది. దుకాణానికి రాకుండానే రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నారనే ఆలోచనతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మళ్లీ గతంలో మాదిరిగానే బయో మెట్రిక్ ద్వారా పంపిణీ చేయాలనే నిర్ణయం తీసుకుంది. కొవిడ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం పంపిణీ ఈనెలతో ముగియనుంది. బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యం!ఓటీపీ విధానం అమల్లోకి వచ్చిన తరువాత రేషన్ దుకాణాల్లో లావాదేవీల సంఖ్య పెరిగింది. జిల్లాలో 2,41,012మంది ఆహార భద్రతాకార్డులు కలిగి ఉండగా, గత ఫిబ్రవరి నెలలో కార్డుదారులు 6500 మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకున్నారు. ఓటీపీ విధానంలో బియ్యం తీసుకునే వారి సంఖ్య గత ఏడాది వ్యవధిలో బాగా పెరిగింది. ఓటీపీ విధానంలో రేషన్ దుకాణాలకు రాకపోయినా బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండడంతో ఇదే అదనుగా బియ్యంఅవసరం లేని కార్డుదారులకు కొంత మొత్తం చె ల్లించి వారు తీసుకోవాల్సిన రాయితీబియ్యాన్ని అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో అక్రమంగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే సంఘటనలు నెలలో 6నుంచి 10 సంఘటనలు వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. ఓటీపీ విధానం ద్వారా రేషన్ బియ్యం దుర్వినియోగం అవుతున్నాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన పరిశీలనలో గుర్తించింది. రేషన్ దుకాణాల్లో ఓటీపీ విధానానికి బదులుగా బయో మెట్రిక్ విధానం తీసుకు రావాలనే నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఓటీపీ విధానానికి బదులుగా ఈనెల నుంచి బయో మెట్రిక్ విధానం తిరిగి అమల్లోకి తీసుకు రావాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించగా, ఆ దిశగా జిల్లా పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది.

# కష్టాల్లో కస్తూర్బా

రంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. కస్తూర్బా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి.. అక్కడే అన్న చందంగా తయారైంది. పాఠశాలలో నెలకొన్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామ పంచాయతీ లాల్‌పహాడ్ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమస్యలతో సతమవుతోంది. పాఠశాలలో ఉన్న అరకొర వసతులతో విద్యార్థినులకు కష్టాలు తప్పడం లేదు. ఈ విద్యాలయంలో మొత్తం 202మంది విద్యార్థినులు ఉన్నారు. అందరికీ కలిపి 20 టాయిలెట్స్ ఉండాల్సి ఉండగా, 10 మాత్రమే ఉన్నాయి. దీంతో కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా, స్నానం చేయాలన్నా రోజూ పొద్దున లేచి క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపడా నీరు రావడం లేదు. మిషన్ భగీరథ నీరు సరఫరా అయినప్పుడు బకెట్లలో పట్టుకుని స్నానం చేస్తున్నామని వాపోతున్నారు.వృథాగా వాటర్‌ప్లాంట్ ఉదయం విద్యార్థులు స్నానాలు చేసేందుకు వేడి నీటిని అందించేందుకు గాను ప్రభుత్వం సోలార్ యంత్రాన్ని అందజేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ లేని కారణంగా యంత్రాన్ని మూలన ఎడేశారు. అలాగే విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేసినా వాటిని బిగించకుండా వదిలేశారు.ఆట స్థలం కరువుకస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి మొత్తం దాదాపు నాలుగు ఎకరాల స్థలం ఉంది. కానీ సరైన మైదానం లేక విద్యార్థినులు ఆటలకు దూరం అవుతున్నారు. పాఠశాల ఎదుట ఉన్న స్థలం సమస్థాయిలో లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది.

# కుమరం భీం ఆసిఫాబాద్‌లో పేరుకే పెద్దాస్పత్రి

ఆసిఫాబాద్ : దశాబ్ధాలు గడుస్తున్నా ఏజెన్సీ వాసులకు వైద్యసేవలు ఇంకా అందని ద్రాక్షలాగే ఊరిస్తున్నాయి. జిల్లాలో కడుపు నొప్పి వచ్చినా.. కాలు నొప్పి వచ్చినా.. పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సిందే. ప్రభుత్వాలు వైద్యఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం కన్పించడం లేదు. జిల్లాలో 70శాతం ఏజెన్సీ గ్రామాలే ఉన్నాయి. ముఖ్యంగా కొండమీద గ్రామాలకు వైద్యసేవలు అందడం గగనంగా మారింది. చచ్చీ చెడి ఆస్పత్రికి చేరితే సరైన సేవలు అందక వైద్యం నానాటీ ఇబ్బందిగా మారింది. ఫలితంగా ఆసిఫాబాద్ ఏజెన్సీలో సర్కారీ వైద్యం పేదలకు ఎండమావిగానే మిగులుతోంది. జిల్లాలో 15మండలాల పరిధిలో ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలున్నా అరకొర సదుపాయాలు వైద్యుల కొరత గ్రామీణులను వైద్యసేవలకు దూరం చేస్తోంది. ఫలితంగా ప్రతి ఏటా ఏజెన్సీవాసులు వైద్య చేయించుకునేందుకు పొరుగునే ఉన్న మంచిర్యాల, ఉట్నూరు, ఇంకాస్తా సీరియస్ కేసులు అయితే ఆదిలాబాద్‌కు వెళ్లుతున్నారు. మరీ ముఖ్యంగా సీరియస్ కేసులు వచ్చిన పరిస్థితుల్లో డాక్టర్లు చేతులు ఎత్తివేస్తుండడంతో బాధిత కుటుంబాలు తమ ఆప్తులను రక్షించుకునేందుకు అటు చంద్రాపూర్, ఇటు హైదరాబాద్‌కు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పరుగులు పెడుతున్న పరిస్థితి. గడిచిన ఐదు సంవత్సరాలుగా జిల్లాలో వైద్యసేవలను విస్తృత పరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం.. పాలకుల పట్టింపు లేని తనమో.. కారణం ఏదైనా నేటికి జిల్లాలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయడం ఏ మాత్రం అతియోశక్తి కాదు. జిల్లాలో ప్రధానంగా సిబ్బంది కొరత వేధిస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సిబ్బందిని భర్తీ చేసుకునేందుకు చర్యలు చేపట్టాల్సి ఉన్న ఏ కారణం చేతో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నియామకాలను చేయక పోవడం అనేక విమర్శలకు దారితీస్తోంది. జిల్లాలో ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న దృష్ట్యా గడిచిన కొద్ది సంవత్స రాలుగా ఏజెన్సీ మహిళల్లోనూ వైద్యంపట్ల వైఖరి మారింది. అయితే ప్రసూతికి అవసరమైన గైనకాలిజిస్టులు జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేరు. పరిస్థితి విషమించిన మహిళలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలోనే ప్రాణాలు కొల్పోయిన దయనీయ ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. వైద్యనిపుణుల కొరత ప్రధాన




సమస్యఆసిఫాబాద్ ఏజెన్సీలో మొత్తం 20ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆస్పత్రులు, మరో రెండు పట్టణఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు సంబంధించి 70మంది వైద్యులను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 20 మంది సేవలు అందిస్తున్నారు. ఇక ఆసిఫాబాద్ 50పడకల సామాజిక ఆస్పత్రిలో మొత్తం అన్ని రకాల పోస్టులు కలుపుకొని 48 మంది వైద్యనిపుణులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 9మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఇంకా విచిత్రం ఏమిటీ అంటే గడిచిన కొద్దిసంవత్సరాలుగా ఈ ఆస్పత్రికి రెగ్యులర్ సూపరింటెండెంట్ లేదు. వైద్య విధానపరిషత్ పూర్తిస్థాయి అధికారిని నియమించడంలో ఎందుకో తాత్సారం చేస్తోంది. ఫలితంగా ఇన్‌చార్జీలతోనే ఆస్పత్రి నిర్వహణ కొనసాగిస్తుడడంతో ఇక్కడ జవాబుదారి తనం పూర్తిగా లోపించిందన్న విమర్శలున్నాయి. ఇటీవల ఒక గైనకాలజిస్టును నియమించినా సదరు డాక్టర్ అంతంత మాత్రంగానే విధులకు హాజరవుతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే ఇటీవలే కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ శస్త్ర చికిత్సలకు అవసమైన ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేయకపోవడం ఇక్కడ మౌలిక సదుపాయాల లోపానికి దర్పణం పడుతోందని చెప్పవచ్చు. దీంతో ప్రభుత్వాస్పత్రికి రావాలంటే బాధితులు జంకుతున్నారు. ప్రమాదాలు జరిగిన సంఘటనలో చికిత్స అందించేందుకు కంటి, ఎముకల నిపుణులను నియమించాలన్న డిమాండ్ ఎంతో కాలంగా ఉన్నా నేటికీ అది తీరని కోరికగానే మిగిలి పోయింది. అతీగతీ లేని డయాలసిస్‌ఆసిపాబాద్ జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య అధికంగా ఉంది. ముఖ్యంగా సిర్పూరు(యూ),లింగాపూర్, తిర్యాణి మండలాల పరి ధిలో కిడ్ని వ్యాధిగ్రస్తుల సంఖ్య పెద్దగా ఉండడంతో గతంలో స్పందించి అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆసిఫాబాద్‌కు డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే నేటికీ ఆయన హామీ ఆచరణలోకి రాలేదు. దీంతో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితులు డయాలసిస్ చేయించుకునేందుకు ఉట్నూరు, ఆదిలా బాద్, మంచిర్యాల ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు.

# అటవీ అధికారులను అడ్డుకున్న రైతులు

ఇంద్రవెల్లి : ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని ముత్నూర్ గ్రామశివారు గుట్టపైన అటవీశాఖ అధికారులు గుంతలు తవ్వుతుండగా రైతులు అడ్డుకున్నారు. అటవీ శాఖ అధికారులు పోలీసు సిబ్బందితో రైతులు పోడు సాగు చేసుకుంటున్న భూముల్లో మొక్కలు నాటేందుకు పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన రైతులు మొక్కలు నాటే కార్యక్రమం పేరుతో తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని వారిని అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే గుంతలు తవ్వి మొక్కలు నాటుతున్నామని అటవీ అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలిస్తామని దరఖాస్తులు స్వీకరించి దానిపై ఎలాంటి ఆదేశాలు రాకున్నా.. ప్రస్తుతం భూముల స్వాధీనం చేసుకోవడానికి ఎందుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు. ఎఫ్‌బీఓలు జ్యోతి, వీణ, రైతులు గంగారాం, మల్లేశ్, కళాబాయి తదితరులు ఉన్నారు.

# దేవునికుంటలో మట్టిదందా

మెదక్ : అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కొందరు ఇష్టారీతిన మట్టిదందాకు పాల్పడుతున్నారు. సదాశివపేట మండలం ఆత్మకూరు శివారులో దేవునికుంట ఉంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న నీటి వనరును ధ్వంసం చేసేలా కొందరు పట్టపగలే మట్టి తవ్వి తరలిస్తున్నారు. తమకు పంచాయతీ నుంచి తీర్మానం ఉందని చెప్పి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను వినియోగిస్తూ దర్జాగా దందా చేస్తున్నారు. వాస్తవానికి పూడిక మట్టిని మాత్రమే రైతుల పొలాలకు తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. ఇదంతా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల ఆదేశాల మేరకు జరగాల్సి ఉంటుంది.



ఇక్కడ అలాంటిదేమీ లేదు. తమకు నచ్చిన చోట మట్టిని తవ్వుతూ తీసుకెళ్లిపోతున్నారు. గ్రామ సమీపంలోని ఒక చోట కుప్పలుగా పోస్తున్నారు. ఈ భూమి కాస్త లోతుగా ఉండటంతో దాదాపు 600 ట్రిప్పుల మట్టిని నింపేలా పనులు చేస్తున్నామని అక్కడే ఉన్న ఒక వ్యక్తి వివరించారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దారు మనోహర్ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లగా... తాను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందినా రోజంతా యథావిధిగా మట్టి తరలింపు కొనసాగడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరలించిన మట్టికి సమానమైన పరిహారాన్ని సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# క్షయ.. అప్రమత్తతే రక్ష

సిద్దిపేట : క్షయ.. తుమ్మినా, దగ్గినా, నోటి నుంచి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రాణాల మీదకు తెస్తుంది. చాపకింద నీరులా క్షయ విస్తరిస్తుండగా ఆందోళన కలిగిస్తోంది. అత్యధికంగా పారిశ్రామిక వాడలో దీని వ్యాప్తి అధికంగా ఉంటోంది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు వ్యాధి నివారణకు నడుం బిగించారు. అవగాహన కల్పనకు చర్యలు చేపట్టారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పరిస్థితిపై కథనం.

సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెమడ పరీక్షించి వ్యాధి ఉన్నది లేనిది నిర్ధారిస్తున్నారు. ఒకవేళ ఉన్నట్లు తేలితే మందులు అందిస్తున్నారు. వారి కుటుంబంలోని సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బాధితుల నుంచి ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. నిక్షయ్ పోషణ్ యోజన కింద నెలవారీ రూ.500 పింఛన్ రూపంలో ప్రభుత్వం అందిస్తోంది.

ప్రత్యేక వైద్యశిబిరాలు

వికారాబాద్ జిల్లాలో 5 చోట్ల పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ప్రత్యేకంగా వికారాబాద్ పరిధి అనంతగిరిలో క్షయ, ఛాతి వ్యాధుల నివారణ ఆసుపత్రి ఉంది. 1947లో దీన్ని ఏర్పాటుచేయగా.. ప్రస్తుతం 417



మంచాలు ఉన్నాయి. క్షయ రోగానికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు పంపిణీ చేస్తుండటంతో ఇక్కడికొచ్చే వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకొని జిల్లాలో 21 రోజులు పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. దీర్ఘకాలికంగా దగ్గు, దమ్ముతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నామని, వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ తెలిపారు.

కేసుల నిర్ధారణలో జిల్లా ప్రథమం

గతేడాది టీబీ కేసుల నిర్ధారణలో సిద్దిపేట జిల్లా విభాగం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 20న హైదరాబాద్‌లోని టీబీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పురస్కారం అందుకుంది. జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు చేస్తున్నారు. సిద్దిపేటలోని జిల్లా టీబీ క్లినిక్‌లో సీబీ నాట్, గజ్వేల్, దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రూనాట్ పరీక్షలు చేసే సదుపాయం ఉంది. మరోవైపు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తన సొంత నిధులతో నియోజకవర్గంలోని 150 మందికి ప్రతి నెలా పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థ చేయూత..సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 4432 మందికి పింఛన్ అందుతోంది. అత్యధికంగా పరిశ్రమలు పటాన్‌చెరు, సదాశివపేట ప్రాంతాల్లో టీబీ అలర్ట్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ప్రత్యేకంగా ఆటోలు ఏర్పాటు చేసి అనుమానితులను ఆసుపత్రులకు తరలించి పరీక్షలు చేయించి, మందులు సరఫరా చేస్తోంది. జిల్లాలో వ్యాధి నివారణకు వైద్య కళాశాల విద్యార్థులు, ఎన్‌జీవో స్వచ్ఛంద సంస్థల దాతల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత జిల్లా అధికారి రాజేశ్వరి వివరించారు.

దాతల సహకారం..మెదక్ జిల్లాలో స్క్రీనింగ్ పరీక్షలు ఎక్కువగా నిర్వహిస్తుండటంతో పాటు నివారణ చర్యలు పకడ్బందీగా చేపడుతున్నారు. 2022లో జిల్లాలో 1,684 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 416 మంది బాధపడుతున్నట్టు గుర్తించారు. వీరికి పూర్తిగా తగ్గే దరకు ఔషధాలు అందిస్తున్నారు. ప్రతి నెలా ఒక్కో పీహెచ్‌సీ పరిధిలోని రెండు ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండే గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడంతో పాటు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేస్తున్నారు. ఆయా పీహెచ్‌సీలలో దాతల సహకారంతో బాధితులకు ఆహారం అందిస్తున్నారు. బియ్యం, నూనె, పప్పు, గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

# కొరవడిన నిర్వహణ.. నీటికి వేదన



మెదక్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పరిష్కారం చూపింది. ఇందుకోసం ప్రతి గ్రామంలో ట్యాంకు నిర్మించి, పైప్‌లైన్ వేసి, కుళాయిలను బిగించారు. అయినా ఇంకా పల్లెల్లో ఎద్దడి నెలకొంది. లీకేజీలతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. జిల్లాలో ఎదురవుతున్న ఇబ్బందులను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చిన అంశాలు ఇలా.. జిల్లాకు సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వద్ద మిషన్ భగీరథలో రూ.857.42 కోట్లు వెచ్చించి, ఫిల్టర్‌బెడ్ నిర్మించారు. అయితే తరుచూ సాంకేతిక సమస్యలతో తలెత్తుతున్నాయి. చక్రియాల ఇన్‌టెక్‌వెల్ వద్ద విద్యుత్తు సమస్యతో నర్సాపూర్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు రెండూ, మూడు రోజుల పాటు సరఫరా నిలిపివేస్తున్నారు.

ట్యాంకు నిరుపయోగం : నర్సాపూర్ మండలం జగ్యాతండాలో ట్యాంకు వృథాగా ఉంది. దీనిని వినియోగంలోకి తీసుకువస్తే విద్యుత్తు, సాంకేతిక సమస్యలు తలెత్తితే వినియోగించుకోవచ్చు. దీని పక్కనే ఉన్న బోరు నుంచి ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. మంజీరా సరఫరా నిలిచిపోయినప్పుడు వ్యవసాయ బోర్లే దిక్కవుతున్నాయి.

మరమ్మతుకు నోచక : శివ్వంపేట మండలం నానుతండాకు సాంకేతిక కారణాలతో మంజీరా నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికంగా ఉన్న మూడు బోర్లే ఆధారమయ్యాయి. అయితే వీటిలో రెండు పనిచేయడంలేదు. కొల్చారం, కౌడిపల్లి, వెల్దుర్తి మండలాల్లో మంజీరా నీటి సరఫరా లేని సమయాల్లో అవస్థలు తప్పడంలేదు. ఈ విషయమై డీఈఈ కిషన్ మాట్లాడుతూ.. మంజీరా సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. టేక్మాల్ మండలం వెంకటాపూర్‌లో ఒకే ట్యాంకు ద్వారా సరఫరా చేయడంతో సరిపోవడం లేదు. గతంలో నిర్మించిన ట్యాంకు ఉపయోగంలో లేదు. మరమ్మతు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

పగిలిన పైపులైన్లు : పాపన్నపేట మండలం డాక్య, రాజ్య, అమ్రియా తండాలకు నీటి సరఫరా కావడంలేదు. అధికారులకు విన్నవించినా, స్పందించడం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. పాపన్నపేట, కొడపాక, కొత్తపల్లి గ్రామాల్లోని పలు కాలనీల్లో సరిపోను రావడంలేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల పైపులైన్లు పగిలాయి. మరమ్మతు చేపట్టడంలేదు.

బోర్లే దిక్కు : అల్లాదుర్గం మండలం రాంపూర్ శివారు పెద్దమ్మ ఆలయ సమీపంలో పైపులు లీకై నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో కలుషితమవుతున్నాయి. మండలంలోని వెంకటారావుపేట్‌లో బోరు బావుల వద్దకు వెళ్తున్నారు. పెద్దశంకరంపేట తిరుమలపురం కాలనీ, అంబేడ్కర్ చౌక్ వద్ద ఇదే పరిస్థితి. రేగోడ్ మండలం పోచారంలోనూ పదిహేనురోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిసరఫరా అవుతోంది. కలుషితమయ్యేందుకు ఆస్కారం లేదు.

సమస్యలున్నా, లీకేజీ గురించి తెలిసినా వెంటనే పరిష్కరిస్తున్నాం. చక్రియాల్ ఉపకేంద్రం నుంచి పరిశ్రమలకు కనెక్షన్లు ఉండడం వల్ల లోడు పెరిగి విద్యుత్తు నిలిచిపోతోంది. ప్రత్యేక హెచ్‌టీ లైన్ వేయనున్నాం.దినేశ్, కిషన్, డీఈఈలు, మిషన్ భగీరథ

# కేంద్రాల్లో ఆహ్లాదం.. చిన్నారుల వికాసం




మెదక్ : జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నారు. ఇందుకోసం 11 ఎంపిక చేశారు. ఒక్కో దానికి రూ.3.50 లక్షల చొప్పున సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ద్వారా నాలుగు ప్రాజెక్టుల పరిధిలో నర్సాపూర్-5, అల్లాదుర్గం-1, రామాయంపేట-2, మెదక్-3 ఎంపిక చేశారు. నర్సాపూర్ పరిధి రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, జక్కపల్లి, నర్సాపూర్-2, మల్కాపూర్ ఉన్నాయి. ఎంపిక చేసిన కేంద్రాలకు రంగులు వేయించడం, ప్రహరీ నిర్మాణం, గోడలపై ఆకట్టుకునేలా బొమ్మలు వేయించడం చేస్తున్నారు. మూడేళ్ల లోపు చిన్నారులకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అవసరమైన పౌష్టికాహారం చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. పరిశుభ్రంగా ఉంచి, ఆట వస్తువులను సమకూరుస్తున్నారు. గోడలపై ఆంగ్ల ఉచ్ఛరణకు సంబంధించిన పదాలు, తెలుగు, ఆంగ్లం అక్షరాలు, సీతాకోకచిలుకల బొమ్మలు, అక్షరాలను సూచించే చిత్రాలు, పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు, పాలిచ్చే తల్లుల, చిన్నారుల చిత్రాలు ఆకర్షిస్తున్నాయి.పిల్లల సంఖ్య పెరిగేలా

చిన్నారుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు కేంద్రాలకు వచ్చినప్పుడు కొంత సమయాన్ని వెచ్చించేలా చర్యలు తీసుకుంటున్నారు. చిన్నారుల పరిస్థితిపై సీడీపీవోలు, పర్యవేక్షకులు, అంగన్వాడీ ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. పోషణ్ అభియాన్, ఆరోగ్యలక్ష్మి పథకం అమలు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, కేంద్రాల్లో ఇచ్చే బాలామృతాన్ని బిడ్డకు ఎలా అలవాటు చేయాలో కూడా చైతన్యపరుస్తున్నారు. పిల్లల బరువు ఎత్తు కొలతలు, తక్కువ బరువు ఉన్నవారి పోషణ ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్రాల ఆవరణలో పెరటి తోటల పెంపకం చేపడుతున్నారు.

ఆకర్షణీయంగా ఉండాలన్నదే లక్ష్యం

కొన్ని కేంద్రాలను ఎంపిక చేసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. తద్వారా సాధించిన ఫలితాలను గమనించి భవిష్యత్తులో అన్ని కేంద్రాలను ఇదే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. వీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వసతుల్లో ఆదర్శంగా ఉంచడంతోపాటు, సేవల్లోనూ మెరుగుగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం.బ్రహ్మాజీ, జిల్లా అధికారిణి

# మద్నూర్-బోధన్ జాతీయ రహదారి పనులకు గ్రీన్ సిగ్నల్



కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మరో జాతీయ రహదారి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారి పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులను ఇస్తూ జీవోను జారీ చేసింది. అంతేకాకుండా ఈ పనులు చేపట్టేందుకు రూ.429కోట్లను సైతం మంజూరు చేసింది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నుంచి మద్నూర్ వరకు ఉన్న రెండు లైన్ల ప్రధాన రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా మార్చనున్నారు. ఇటీవల జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మద్నూర్-బోధన్ జాతీయ రహదారి పనులు చేపట్టాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరికి పలుమార్లు విన్నవిస్తూ వచ్చారు. దీంతో కేంద్రం ఈ రహదారి పనులకు అనుమతులు జారీ చేయడంపై ఎంపీ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాలుగులైన్ల జాతీయ రహదారి పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాల స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్న మద్నూర్-బోధన్ జాతీయ రహదారి కల త్వరలోనే నెరవేరనుంది.

గతంలోనే ఎన్‌హెచ్ 166 జాతీయ రహదారికి శంకుస్థాపన

భైంసా-బాసర-బోధన్-మద్నూర్ వరకు జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 166 బీబీ నామకరణం చేసి మంజూరు చేసింది. అయితే ఏడాది కిందట మొదటి విడత కింద భైంసా-బాసర-బోధన్ వరకు ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సర్వే పూర్తిచేసి భూ సేకరణలో ఉన్నారు. దీంతో పాటు మద్నూర్ వరకు సైతం ఇదివరకే సర్వే పూర్తి చేశారు. బోధన్ నుంచి మద్నూర్ వరకు ప్రస్తుతం రెండు లైన్ల రహదారి ఉంది. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణకు పరిపాలన అనుమతులు రావడంతో ఆయా మండలాల స్థానిక గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మద్నూర్ ప్రజలు తమ రోడ్డు కూడా పూర్తవుతుందని ఎదురుచూస్తూ వచ్చారు. బోధన్ నుంచి మద్నూర్ వరకు 161 జాతీయ రహదారి పనులకు సైతం కేంద్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేశారు.

76 కి.మీ.ల వరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 161 బీబీ జాతీయ రహదారిని గతంలోనే మంజూరు చేసింది. ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాల పరిధిలో బోధన్, కోటగిరి, మద్నూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాలను కలుపుతూ నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు 76 కి.మీల మేర ఈ జాతీయ రహదారి పనులు కొనసాగనున్నాయి. ఉమ్మడి జిల్లాల పరిధిలో 5 మండలాలైన బోధన్, కోటగిరి, రూద్రుర్, పొతంగల్, బీర్కూర్, డోంగ్లి, మద్నూర్ వరకు ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరగనున్నాయి. అయితే 2018లోనే ఈ జాతీయ రహదారి పనులకై సర్వే సైతం పూర్తి చేయడమే కాకుండా హద్దురాళ్లను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బోధన్, మద్నూర్ వరకు జాతీయ రహదారి పనులకై కేంద్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేయడమే కాకుండా రూ.429 కోట్ల నిధులను మంజూరు చేయడంతో పనులు పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే రోడ్డు విస్తరణకు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది.

# కష్టం విలువ సున్నా

యాదాద్రి : గడ్డం ఎల్లారెడ్డి. మోత్కూరు మునిసిపాలిటీలో నివసిస్తున్న కౌలు రైతు గడ్డం ఎల్లారెడ్డి మోత్కూరు సమీపంలో 13 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నాడు. ఎకరాకు రూ.27వేల వరకు పెట్టుబడి పెట్టాడు. మొత్తం 13 ఎకరాలకు రూ.3,51,000 పెట్టుబడి వ్యయం అయింది. వరి పంట ఏపుగా పెరిగి కోతకు వచ్చింది. మార్కెట్లలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో ఉగాది పండుగ తరువాత పంట నూర్పిడి చేద్దామనుకున్నాడు. ఈ నెల 19న రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి సగానికి పైగా ధాన్యం రాలింది. అయితే ప్రభుత్వం తాజాగా, ఎకరాకు రూ.10వేలు పంట నష్టపరిహారం ప్రకటించింది. దీంతో అతడికి రూ.1,30,000 పరిహారంగా అందనుంది. అయితే పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని, చేసిన కష్టం వృథా అయిందని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఆరుగాలం శ్రమించిన రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈనెల 18, 19న ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు కురిశాయి. దీంతో వరితో పాటు పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22,858 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. యాదాద్రి జిల్లాలో 8,275 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 12,873, నల్లగొండ జిల్లాలో 1,710 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

యాదాద్రి జిల్లాలో ఆత్మకూరు మండలంలోని 15 గ్రామాలు, గుండాలలో తొమ్మిది, అడ్డగూడూరులో మూడు, మోత్కురులో మూడు, వలిగొండ ఐదు, రాజపేటలో రెండు, మోటకొండూరులో ఐదు, రామన్నపేటలో మూడు, చౌటుప్పల్‌లో 10 గ్రామాల్లో వడగళ్లు కురిశాయి. ఈ నెల 18న కురిసిన వర్షానికి 4,343 ఎకరాల్లో, రెండోరోజు కురిసిన వర్షానికి 3,800 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 3,755 మంది రైతులకు చెందిన 8,275 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, దీంతో రూ.17.13కోట్ల మేర నష్టం వాటిల్లిందని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి నివేదించారు.

సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లోని తొమ్మిది గ్రామాల్లో అధికంగా పంట నష్టం వాటిల్లింది. తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లోని వెలిశాల, నెలిగొండతండా, కోకియాతండా, బొల్లికుంటతండా, మామిడాల, గొట్టిపర్తి, జలాల్‌పుర్, తాటిపాముల గ్రామాల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నాయి. గొట్టిపర్తి గ్రామంలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. సూర్యాపేట ఆర్డీవో రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి డి.రామారావునాయక్ తిరుమలగిరి మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వరి 11,495 ఎకరాలు, మొక్కజొన్న 42 ఎకరాలు, మామిడి 1,120 ఎకరాలు, మిరప 216 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు.

నల్లగొండ జిల్లాలో మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో భారీగా వడగళు కురవడంతో రైతులు అధికంగా పంట నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 1,060 ఎకరాల్లో వరి, 650 ఎకరాల్లో మామిడి, పుచ్చ, మిర్చి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.

పరిహారం ఇంతేనా?

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఎకరా వరి సాగు చేయాలంటే దున్నకం, విత్తనాలు, నాట్లు, కలుపుతీత మొదలు పంట చేతికొచ్చేవరకు సుమారు రూ.27వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.10వేలు ప్రకటించటంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు తక్కువ చూపి అన్యాయం చేశారని చాలామంది రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఫోన్ల ద్వారానే సమాచారాన్ని సేకరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు హడావుడిగా అంచనావేయడం వల్ల పూర్తిస్థాయిలో పరిహారం దక్కేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 33శాతం మేర పంట నష్టం వాటిల్లితేనే అధికారులు లెక్కలోకి తీసుకుంటారు. అయితే 33శాతం లోపు నష్టపోయిన తమకు దిక్కెవరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు ఏమాత్రం సరిపోవని, పెట్టుబడులకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

22,858 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

అకాల వర్షాలకు ఉమ్మడి జిల్లాలో 22,858 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. యాదాద్రి జిల్లాలో యాసంగిలో 2,90,527 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అకాల వర్షాలకు 8,148ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు రూ.16.62కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇక కూరగాయలు, ఇతర పంటలు 182.38ఎకరాల్లో దెబ్బతినగా, రూ.51లక్షల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. మామిడి 154 ఎకరాలు, పచ్చి మిర్చి 3, ఎర్రమిర్చి 2, నిమ్మ 8.75, టమాటా 1.63, బొప్పడి 1.5, వంకాయ 0.5, సొరకాయ 1.5, బీరకాయ 0.5, పుచ్చకాయ 7ఎకరాల్లో పంటనష్టం వాట్లిల్లింది. ఈ నెల 18న జిల్లాలో 9.4మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భువనగిరి మండలంలో 43.1మి.మీ, యాదగిరిగుట్టలో 37.78మి.మీ, బొమ్మలరామారంలో 25.8మి.మీ, అత్యల్పంగా గుండాలలో 0.8మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా 19న జిల్లాలో 28.8మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 76.8మి.మీ, భువనగిరిలో 71.4మి.మీ, బొమ్మలరామారంలో 66.4మి.మీ, బీబీనగర్‌లో 45.6మి.మీ, అత్యల్పంగా రామన్నపేట మండలంలో 0.8మి.మీ వర్షపాతం నమోదైంది.

సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లో 7,859 మంది రైతులు 12,873 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. 7,474 మంది రైతులు 11,495 ఎకరాల్లో వరి, 42 మంది రైతులు 42 ఎకరాల్లో మొక్కజొన్న, 202 మంది రైతులు 1,120 ఎకరాల్లో మామిడి, 141 మంది రైతులు 216 ఎకరాల్లో మిరప పంటను నష్ట పోయారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం విడుదల చేస్తే జిల్లాకు రూ.12,87,30,000 మంజూరు కానున్నాయి.

నల్లగొండ జిల్లాలో మర్రిగూడ, నాంపల్లి, చిట్యాల మండలాల్లో వడగళు కరవడంతో రైతులు నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 1,710 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. 1,060 ఎకరాల్లో వరి, 650 ఎకరాల్లో మామిడి, పుచ్చ, మిర్చి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.

పంటనష్టం ప్రభుత్వానికి నివేదించాం : కె.అనురాధ, జిల్లా వ్యవసాయాధికారిజిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 33శాతానికి పైగా దెబ్బతిన పంటలను పరిగణనలోకి తీసుకున్నాం. అవి 8,275ఎకరాల వరకు ఉంటుందని అంచనా. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారు లు పంటనష్టంపై సర్వే నిర్వహించారు. పంట నష్టం రూ.17.13కోట్ల మేర వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసి పంటల వారీగా ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

# ఈ - జోరు

ఖమ్మం : వాతావరణ కాలుష్యం పెద్ద సమస్యగా మారింది. వాహనాల ద్వారానే అధిక శాతం వాయు కాలుష్యం జరుగుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. దీన్ని నియంత్రించేందుకు కాలుష్య రహిత 'ఈ-వాహనాల'(విద్యుత్తు వాహనాలు) వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఇవి నూటికి నూరు శాతం పర్యావరణహితం. నిన్నమొన్నటి దాకా ప్రధాన నగరాలకే పరిమితమైన విద్యుత్తు ద్విచక్ర వాహనాలు, కార్ల వినియోగం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ క్రమంగా పెరుగుతోంది. ప్రముఖ పట్టణాల్లో షోరూంలు సైతం వెలుస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగరం, కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి తదితర పట్టణాల్లోని షోరూంలలో ఈ బైక్‌ల విక్రయాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రతి షోరూంలో నెలకు సుమారు 10-15 ద్విచక్ర వాహనాలు అమ్ముడవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. కార్ల షోరూంలు లేకపోవడంతో హైదరాబాద్‌పైనే ఆధారపడుతున్నారు. కానీ వాహన రిజిస్ట్రేషన్ కోసం స్థానికతకు ప్రాధాన్యమిస్తూ ఇక్కడే చేయించుకుంటున్నారు.

ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి వస్తే..

ఈ బైక్‌లో దూర ప్రాంతాలకు వెళ్లడం సాధ్యంకాదు. ఒకసారి బ్యాటరీ ఛార్జింగ్ పెడితే 250 కిలోమీటర్ల వరకూ వెళ్లడం కుదురుతుందని నిపుణులు చెబుతున్నారు. అక్కడ మళ్లీ ఓ గంట ఛార్జింగ్ పెట్టాలి. ప్రస్తుతం హైదరాబాద్‌లో విద్యుత్తు వాహనాల సంఖ్య పెరగడంతోపాటు ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోనూ ఈ వాహనాల సంఖ్య పెరగాలంటే ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినియోగదారుల నుంచి వ్యక్తమవుతోంది.

రిజిస్ట్రేషన్ అవసరం లేదు

ఎలక్ట్రిక్ బైకుల 50సీసీ కన్నా తక్కువ సామర్థ్యం ఉన్న వాటికి రిజిస్ట్రేషన్ అవసరంలేదని రవాణా అధికారులు చెబుతున్నారు. సాధారణంగా వాహనం ఖరీదును అనుసరించి రోడ్డు పన్ను(టాక్స్) 9 నుంచి 14 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ వీటికి పన్ను మినహాయింపు ఇచ్చారు. నంబర్ ప్లేటు లేకుండానే రోడ్ల మీదుగా హాయిగా ప్రయాణించవచ్చు.

మా అమ్మ కోసం కొన్నా..అజయ్, వల్లాపురం, వైరా మండలం

ా అమ్మ నాగమణి గృహావసరాల నిమిత్తం, బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీంతో తక్కువ వ్యయంతో పాటు సౌకర్యవంతంగా ఉంటుందని కొన్నా. తక్కువ దూరం ప్రయాణించాలంటే ఈ వాహనాన్నే ఎక్కువగా వాడుతున్నాం. ఇంట్లోనే ఛార్జింగ్ చేస్తున్నా.

ఎన్నో లాభాలు..ప్రధానంగా ఇంధనం ఆదా అవుతుంది. ఇంధనంతో నడిచే వాహనాలను కిలోమీటర్‌కు రూ.2 ఖర్చు అవుతుండగా విద్యుత్తు వాహనాలకు రూ.18 పైసలు మాత్రమే అవుతుంది. బ్యాటరీ వాహనాల నుంచి పొగరాదు. వాయు కాలుష్యం పూర్తిగా తగ్గిపోతుంది. ప్రస్తుతం 100 నుంచి 250 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లే సామర్థ్యం ఉన్న అత్యాధునిక లిథియం ఐరన్ పాస్పెట్ బ్యాటరీలు అందుబాటులోకి వచ్చాయి. గంట ఛార్జింగ్ పెడితే 250 కిలోమీటర్లు వెళ్లే బైక్‌లు ఇప్పటికే పలు నగరాల్లో అందుబాటులో ఉన్నాయి.ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి..తోట కిషన్‌రావు, డీటీవో, ఖమ్మంవాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఇంకా ప్రతిపాదనలు రాలేదు. భవిష్యత్తులో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

# అదనపు బాదుడు

ఖమ్మం: ఆశల సాగుకు అలవాటుపడ్డ అన్నదాతలపై అదనపు బాదుడు తప్పడం లేదు. ఈసారి పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరలు మరింత కుంగదీస్తున్నాయి. చేసేదేమీ లేక అప్పో సప్పో తెచ్చిన కర్షకులపై ప్రైవేటు వ్యాపారులు మరింత భారం మోపుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బస్తా యూరియాపై ఏకంగా రూ.60-80 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వానలు దండిగా కురుస్తుండటంతో సీజన్ పనులు జోరందుకున్నాయి. ఈ సారి అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉభయ జిల్లాల్లోనూ సాగు లక్ష్యానికి చేరువలో ఉంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 5,96,149 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా ఉండగా.. 4,30,015 ఎకరాల్లో సాగయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్ష్యం 4,61,850 ఎకరాలు ఉండగా.. ఇప్పటి వరకు 4,10,950 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి, పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, పెసర పంటలు సాగులో ఉన్నాయి. ఈ పంటలకు అధికంగా రైతులు యూరియా వినియోగిస్తారు. ఇదే అదునుగా మలుచుకుంటున్న కొంతమంది వ్యాపారులు ఎమ్మార్పీ ధరల విక్రయాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారు. వినియోగం ఇలా..రెండు జిల్లాలకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంది. ఖమ్మం జిల్లాలో 80,718 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ఇప్పటి వరకు 30,024 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. భద్రాద్రి జిల్లాలో ఈ సారి 50,800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా..ఇప్పటి వరకు జిల్లాకు 27,000 మెట్రిక్ టన్నులు సరఫరా అయింది. బస్తా యూరియాపై ప్రభుత్వం నిర్దేశించిన వాస్తవ ధర రూ.266. సహకార సంఘాలు, గ్రోమోర్ హోల్ సేల్ డీలర్లు, ఇతర ప్రైవేటు దుకాణాల్లోనూ ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్న నిబంధనలున్నాయి. కానీ ఉభయ జిల్లాల్లోనూ కొంతమంది ప్రైవేటు వ్యాపారులు యూరియా ధరలను అమాంతం పెంచేశారు. 45 కిలోల యూరియా బస్తాను ఏకంగా రూ.330 నుంచి రూ.360 వరకు విక్రయిస్తున్నారు. ఇదేంటని రైతులు ప్రశ్నిస్తే యూరియా దిగుమతికి అధిక ఖర్చు అవుతుందని కొందరు, నిల్వ పాయింట్లు లేక పెంచాల్సి వస్తుందని ఇంకొకరు సాకులు చెబుతున్నారు. హమాలీ ఛార్జీలను రైతులు అదనంగా భరిస్తూనే ఉన్నారు.

బిల్లు రశీదులూ ఇవ్వట్లే: రైతులు ఎరువులు, పురుగు మందులు తీసుకున్నప్పుడు కచ్చితంగా వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలి. కొందరు ప్రైవేటు వ్యాపారులు తీసుకున్న ఎరువులకు బిల్లులు కూడా ఇవ్వకపోవడం గమనార్హం. ఒకవేళ రశీదు ఇచ్చినా ఎమ్మార్పీ ధరలకే విక్రయించినట్లుగా బిల్లులు ఇస్తున్నారు. రైతులు నుంచి వసూలు చేసేది మాత్రం అదనంగానే. ఈ తరహా అధిక బాదుడుకు అడ్డుకట్ట పడాలంటే రైతులు మేల్కోవాల్సిన అవసరం ఉంది. అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు కూడా ప్రైవేటు వ్యాపారాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే రైతులకు కొంతైనా మేలు జరిగే అవకాశం ఉంది.

# ఒక్కక్షణం ఆలోచించండి

ఆదిలాబాద్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, వేధింపులు, మానసిక ఒత్తిడిలు ఇలా సమస్య ఏదైనా సతమతమవుతూ.. ఇక చావే గతంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. నూరేళ్ల జీవితాలను ఆదిలోనే అంతం చేసుకుంటున్నారు. క్షణికావేశంలో పురుగుల మందు, ఉరి తాళ్లను ఆశ్రయిస్తూ ఉసురు తీసుకుంటున్నారు. అయితే జిల్లాలో క్రమంగా పెరుగుతున్న ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా మారుతోంది. జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లో 236 మంది వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా వెలుగులోకి రానివి మరెన్నో ఘటనలు ఉన్నట్లు తెలుస్తోంది. జీవితం పట్ల ఏ మా త్రం అవగాహన లేక పోవడం, చిన్న పాటి విషయాలకే భయాందోళనకు గురికావడం, పరువు ప్రతిష్టలకు పోవడం, ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట ఆత్మహత్య ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా పోలీసులు ఆత్మహత్యల సంఘటనలపై సీఆర్‌పీసీ సెక్షన్ 174, ఐపీసీ 306 సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తూ సరిపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కారణం ఏదైనా కడుపునొప్పేనా..?

సమస్య తీవ్రత ఎలా ఉన్నా.. క్షణికావేశంలోనే నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ యేడు జనవరి నుంచి సెప్టెంబరు 2 వరకు జిల్లాలో 236 మంది ఆత్మహత్యలతో ప్రాణాలు తీసుకున్నారంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో తెలుస్తూనే ఉంది. జిల్లాలో కరోనా బారిన పడి మృతి చెందిన వారి కంటే బలవన్మరణాలకు పాల్పడిన వారి సంఖ్యనే ఎక్కువగా కనిపించడం గమనార్హం. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 45ఏళ్ల లోపు వారే అధికంగా ఉంటున్నారు. అయితే కారణం ఏదైనా పోలీసుల రికార్డుల్లో మాత్రం కడుపునొప్పి భరించ లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు కేసులు నమోదవుతున్నాయి.

ప్రాణాలు తీస్తున్న మద్యం కిక్కు..

జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లో జరిగిన ఆత్మహత్యలలో మద్యం మత్తులోనే ప్రాణాలు తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ వ్యసనానికి బానిసై ఇప్పటి వరకు ఈ ఏడు 62 మంది ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. మద్యం మత్తులో ఆత్మహత్యలకు పాల్పడుతూ కుటుంబానికి దూరమవుతున్నారు. మద్యంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ఆ విషయాన్నే పూర్తిగా మరిచిపోతోంది. ఆత్మహత్యనే పరిష్కారమా..!జీవితంలో తలెత్తే చిన్న పాటి సమస్యలనే భూతద్దంలో చూస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతూ ఇక జీవితమే లేదనుకోవడం అనాలోచిత విధా నాలతోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్థోమతకు మించి ఆశపడడం, కోరికలను తీర్చుకునేందుకు అప్పులు చేయడం, అవి తీరక పోవడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకోవడం పరిపాటిగానే మారుతోంది. ప్రేమ విఫలం కావడంతో ఇక జీవితమే ముగిసినట్లు భావిస్తూ ఉసురు తీసుకుంటున్నారు. ఇబ్బందులు మనిషిని సతమతం చేస్తున్నా ఓపికగా ఒక్కక్షణం ఆలోచిస్తే పరిష్కారమార్గం దొరికే అవకాశం లేకపోలేదు.

# వాగు దాటేదెలా?



ఆదిలాబాద్:ానాకాలం వచ్చిందంటే ఆసిఫాబాద్ ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజలకు వాగుల రూపంలో వరద గండాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలను పూర్తిగా తెంచివేస్తున్నాయి. దాంతో వర్షాకాలం అంటేనే జిల్లాలోని ఈ గ్రామాలకు ఎక్కడా లేని భయం.. వర్షాకాలం ముగిసేంతవరకు మారుమూల గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది.

దశాబ్దాలుగా కొనసా...గుతున్న వంతెనల నిర్మాణాలు..జిల్లాలోని వాంకిడి, దహెగాం, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, కెరమెరి మండలాల్లోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు దశాబ్ధాలుగా నత్తను మించిన నడకతో కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు ప్రతీ ఏటా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండి గ్రామానికి వెళ్లేందుకు ప్రజలు నడుములోతు నీటిలో అవస్థలు పడుతున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం కోసం 2005లో రూ.3.5కోట్లు అంచనా వేయంతో శంకుస్థాపన పనులు ప్రారంభించారు. మొదట్లో నాబార్డ్ నిధులు మంజూరు చేసినా ఆ తర్వాత నిధులు నిలిచిపోవడంతో ఈ పనిని 2016లో ఆర్‌అండ్‌బీకి బదలాయించారు. తట్ట మట్టి తీయకుండానే ఆర్‌అండ్‌బీ చేతులు దులుపుకోవడంతో తాజాగా రూ.11కోట్ల అంచనాతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా నిర్మాణానికి ప్రతిపాదించారు. అయినా పనుల్లో ఏమాత్రం ముందడుగు లేదు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలకు ఇబ్బందులు తప్పవు. కెరమెరి మండలంలోని ఉమ్రి వంతెన అసంపూర్తిగా ఉండడం వల్ల మహారాష్ట్రలోని 12గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే పెంచికల్‌పేట్ మండలంలో పెద్దవాగుపై సరిగ్గా 14సంవత్సరాల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించినా నేటికీ పిల్లర్ల దశను దాటలేదు. అలాగే దహెగాం మండలం దిగడ గ్రామం వద్ద పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ఇక్కడ 2019లో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెంచికల్‌పేట మండలం కమ్మర్‌గాం నుంచి దహెగాం మండలం దిగడ మీదుగా మంచిర్యాల జిల్లా వేమనపల్లి వరకు బీటీ రోడ్డు, వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నక్సల్స్ ప్రాంతాల అభివృద్ధి పథకం కింద రూ.14 కోట్లు మంజూరు చేసింది. నిన్నమొన్నటి వరకు పనులు సాగినా దిగడ వద్ద పెద్దపులి దాడి చేసి ఓ యువకుడిని చంపివేయడంతో పనులకు బ్రేక్ పడింది. ఇక కాగజ్‌నగర్-వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద బ్రిడ్జి నిర్మాణం 15సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉంది. వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కెరమెరి మండలంలోని అనార్‌పల్లి-కరంజివాడ, లక్మాపూర్, ఉమ్రి వంతెనల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో అయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పెంచికల్‌పేట పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆయాగ్రామాల ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తూ మృత్యువాత పడుతున్నారు. తిర్యాణి మండలం లోని అమీన్‌గూడ, ఎదులపాడ్‌ల సమీపంలోని వాగులపై వంతెనలు మంజూ రైనా అటవీశాఖ అనుమతుల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ఇదిలా ఉంటే వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా ఈ వంతెనలే కాకుండా 136చిన్న చిన్న వంతెనలు కాజ్‌వేలు, మధ్యతరహా కల్వర్టులు నిర్మించాల్సి ఉందని పంచాయతీరాజ్‌శాఖ ప్రతిపాదనలు తయారు చేసింది. ఇందుకుగాను మొత్తం 172.60కోట్లు నిధులు అవసరమవుతాయని అంచనా వేసి ఐదేళ్లక్రితమే ప్రభుత్వానికి నివేదికలు పంపినా నేటికీ మోక్షం లభించలేదు.

వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి..- బొమ్మకంటి కిరణ్, గుండి

గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు వెంటనే ప్రారంభించాలి. 15ఏళ్లుగా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా గుండి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి రావాలంటే వాంకిడి మండలం ఖమాన మీదుగా రావాల్సిన పరిస్థితి నెలకొంది.

గుండి వంతెన నిర్మాణానికి రీటెండర్..- రాంమోహన్‌రావు, ఈఈ పంచాయతీరాజ్

ఆసిఫాబాద్ మండలంలోని గుండి పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి మళ్లీ రీటెండర్ పిలువనున్నాం. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాం. కెరమెరి మండలం అనార్‌పల్లి-కరంజివాడ వంతెన నిర్మాణ పనులు ఇటీవలే ప్రారం భించాం. వర్షాల కారణంగా పనులు నిలిచి పోయాయి.

# బడి బస్సులు.. బాగయ్యేనా?

ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి కారణంగా మూతపడ్డ విద్యాలయాలు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంతాలు, సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులను తరలించటానికి సమకూర్చుకున్న ప్రైవేటు పాఠశాలల బస్సులు ఏడాదిన్నరగా మూలన పడి ప్రస్తుతం నడవటానికి మొరాయిస్తున్నాయి. వీటిని మరమ్మతులు చేయించుకోవటానికి భారీగా వ్యయం చేయాలి. ఈ ఏడాదిన్నర కాలానికి చెందిన రవాణా రుసుమును ప్రభుత్వానికి బకాయి పడ్డారు. రవాణా రుసుము, అపరాధ రుసుంతో పాటు చెల్లించి, బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకొని ధ్రువపత్రాలు పొందాకే బస్సులను నడపాలనటంతో యాజమాన్యాలు ఆలోచనలో పడ్డాయి.జిల్లాలో వివిధ ప్రైవేటు పాఠశాలల బస్సులు 193 ఉన్నాయి. ఏడాదిన్నరగా విద్యాసంస్థలు మూసి ఉండటంతో ఇవన్నీ మూలన పడ్డాయి. కొన్నింటికి చక్రాలు చెడిపోగా, మరి కొన్నింటికి సెల్ఫ్ బ్యాటరీలు పాడయ్యాయి. బస్సులోని వైర్లు ఎలుకలు కొరికేశాయి. చాలా బస్సులు ప్రస్తుతం నడిచే పరిస్థితిలో లేదు. వీటికి మరమ్మతులు చేయించాలంటేనే భారీగా ఖర్చు చేయాల్సి రావటం.. ఏడాదిన్నరగా పాఠశాలలు మూత పడి ఆదాయం లేకపోవటంతో యాజమాన్యాలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈ ఏడాదిన్నర కాలానికి చెందిన రవాణా రుసుమును సైతం అపరాధ రుసుంతో పాటు చెల్లించి బస్సులకు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు పొందాలని రవాణా శాఖాధికారులు సూచిస్తున్నారు. కరోనా దృష్ట్యా గతేడాదికి చెందిన రెండు త్రైమాసికల రుసుమును మాత్రమే ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన త్రైమాసికాల రుసుము అపరాధ రుసుముతో పాటు చెల్లించాలనటంతో వారు అయోమయానికి గురవుతున్నారు.

ఆరు త్రైమాసికాలకు చెల్లించాల్సిందే..

ఒక్కో బస్సుకు రెండు త్రైమాసిక రుసుము ప్రభుత్వం మాఫీ చేసింది పోను బడి బస్సులకు ఆరు త్రైమాసికాలు రుసుమును చెల్లించాల్సి ఉంది. మూలన పడ్డ బస్సులకు మరమ్మతులు చేయించాలంటే జిల్లాలో ఎక్కడా సర్వీసింగ్ కేంద్రాలు లేవు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు తరలించాల్సి ఉంటుంది. స్టార్ట్ కాని ఈ బస్సులను ఎలా తరలించాలోనని అయోమయానికి గురవుతున్నారు. ఒక్కో బస్సు మరమ్మతులు, రవాణా త్రైమాసికాల రుసుము, బీమా రుసుములు కలుపుకొని దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వ్యయం చేయాల్సి ఉంది.

ఈ నెలాఖరు వరకు గడువు ప్రైవేటు పాఠశాలల బస్సుల యాజమాన్యాలు వారి బడి బస్సులకు చెల్లించాల్సిన త్రైమాసికాల రుసుమును చెల్లించటానికి ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడవు ఇచ్చింది. అపరాధ రుసుముతో పాటు చెల్లించాలని సూచించింది. అయితే బస్సులు నడవని కాలానికి త్రైమాసికాల రుసుమును పూర్తిగా మాఫీ చేయాలని పాఠశాల యాజమాన్యాలు కోరుతున్నాయి.

# వండివార్చలేం..!

ఖమ్మం :పిల్లల అన్నానికి పెద్దలు ఎసరు పెడుతున్నారు. సరైన సమయానికి నిధులు ఇవ్వకపోవడం, నిర్వాహకుల మధ్య భేధాభిప్రాయాలు, ఇతరత్రా సమస్యలతో మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతోంది. కరోనా సమయంలో పిల్లలకు సరైన పౌష్టికాహారం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు బడులు తెరవడంతో ఇప్పటికైనా మంచి ఆహారం అందుతుందని సంబరపడుతున్న పిల్లలకు పథకం లోపాలు శాపాలుగా మారుతున్నాయి. బకాయిలు అధికంగా పేరుకపోవడంతో మహిళలు అప్పులుచేసి మధ్యాహ్న భోజనాన్ని తయారుచేస్తున్నారు. కొన్నిచోట్ల ఉపాధ్యాయుల సాయంతో నెట్టుకొస్తున్నారు.

పాఠశాలల్లో పంచాయితీలు

పాఠశాలల్లో భోజన తయారీ విషయంలో నిర్వాహకుల మధ్య పంచాయితీలు జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలలో ముగ్గురు, నలుగురు మహిళలు కలిసి తయారుచేస్తున్నారు. వీరి మధ్య వివాదాలు వచ్చినపుడు కొందరు బయటకు వెళ్తున్నారు. అలా వెళ్లిన సమయంలో వారి బ్యాంకు ఖాతాల్లో వేతనం పడకుండా చేయడం, కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వడం ఇబ్బందికరంగా మారింది. నిర్వాహకులు సక్రమంగా భోజనం తయారుచేయకపోతే వారి స్థానంలో కొత్తవారిని ఏర్పాటుచేయటం ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీలతో సాధ్యం పడటం లేదు. దానికి ఓ కమిటీ ఉండటంతో వారంతా నిర్ణయం తీసుకుని మార్చాల్సి ఉంది. దీంతో సక్రమంగా



భోజనం తయారుచేయకపోయినా కొనసాగించాల్సిన పరిస్థితి. లోపాలకు ప్రధానోపాధ్యాయుడినే బాధ్యుడిగా చేస్తుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు. నిర్వాహకులను బతిమిలాడుతూ బండినెట్టుకొస్తున్నారు. ఉభయ జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో బకాయిలు అధికంగా ఉన్నాయి. తొమ్మిది, పది తరగతులవి అధికంగా పేరుకుపోవడం గమనార్హం.

సమస్యల పొగ..

ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కావడం లేదు. వచ్చే అరకొర వేతనం కూడా సమయానికి పడటం లేదు. మరోవైపు నిర్వాహకులు భోజన తయారీకి దొరికిన చోటల్లా అప్పులు చేశారు. వాటికి కిరాయి దుకాణాలు, ఇతరత్రా వ్యాపారులు వడ్డీలు వేస్తున్నారు. దీంతో వాటిని చెల్లించడం పెద్ద సమస్యగా మారింది. ఉన్నత పాఠశాలల్లో పథకానికి ఒక్కో పాఠశాలకు రూ.2 నుంచి రూ.5లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, మధిర ఇలా పట్టణాలకు దగ్గరగా ఉన్న అర్బన్ పాఠశాలల్లో పిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అక్కడ భోజన తయారీ కష్టతరంగా మారి నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు కూలికి వెళితే బయట రూ.500 వరకు వస్తుంటే కేవలం రూ.వెయ్యి వేతనం కోసం పనిచేయడం కష్టంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిచెన్‌షెడ్లు లేకపోవడంతో బయట కట్టెల కింద వంటచేయడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బకాయిలు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా చూడాల్సిన బాధ్యత ఉంది. ఇదీ పరిస్థితి..కొణిజర్ల ఉన్నత పాఠశాలలో భోజనం తయారుచేసే మహిళలు తమకు 18 నెలలు బిల్లులు రావాల్సి ఉందని అధికారులకు మొరపెట్టుకున్నారు. పినపాక మండలంలో నిర్వాహకులు బకాయిలున్నా అక్కడి ఉపాధ్యాయుల సహకారంతో కష్టంగా పథకాన్ని నెట్టుకొస్తున్నారు. బోనకల్లు మండలం రావినూతలలో నాలుగు పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమవల్ల కాదంటూ చేతులెత్తేశారు. తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి, మధిర మండలాల్లోనూ నిర్వాహకుల మధ్య వివాదాలు వస్తున్నాయి. వారికి సర్దిచెప్పడం, చేయించడం ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. భద్రాద్రి జిల్లాలో పలు మండలాల్లోనూ బకాయిలు రాకుంటే వండలేమంటూ చెబుతున్నారు. ఎస్‌ఎంసీ కమిటీలు, ఇతర పెద్దలు కలగజేసుకుని సర్దిచెబుతున్నారు.

# శివారు కాలనీల్లో ఆక్రమణలు

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలు కలిసిపోయాయి. మూడేళ్ల కిందట ఉన్న గ్రామాలన్నీ కాలనీలుగా అవతరించాయి. పంచాయతీ పరిధిలోని స్థలాలు, ఆస్తులు నగరపాలకకు అప్పగించగా ప్రభుత్వ భూములన్నీ రెవెన్యూ అధీనంలోనే ఉన్నాయి. భవిష్యత్తు అవసరాలకు, అభివృద్ధి పనులకు కావాల్సిన ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయి. లేఅవుట్ల కింద వదిలేసిన స్థలాలతో పాటు రెవెన్యూ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు కూడా కొన్ని చోట్ల కబ్జాకు గురై ఖాళీ అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వీటికి సంబంధించిన వివరాలన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉండటంతో నగరపాలక సైతం సంబంధం లేనట్లుగానే ఉంటున్నారు. ఇంకేముంది రూ.కోట్లు విలువ చేసే స్థలాలు వివాదస్పదంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అనధికారిక లేఅవుట్లే అధికం ప్రభుత్వ స్థలాలు ఓ వైపు అన్యాక్రాంతం అవుతుండగా, మరోవైపు అనధికారిక లేఅవుట్లతో ప్రజావసరాలకు కావాల్సిన స్థలం మాయమవుతున్నాయి. పట్టణంతో పాటు నగరంలో లేఅవుట్లు చేసే సమయంలో పది శాతం స్థలం కేటాయించాల్సి ఉంటుంది. ఇందులో సామాజిక అవసరాల కోసం భవనాలు, పార్కులు నిర్మించుకోవడానికి అవకాశముంటుంది. అధిక శాతం నగర శివారుల్లో పెద్ద పెద్ద స్థలాలను విభజించి లేఅవుట్లు చేయడం, లేదంటే ప్లాట్లుగా చూపించి విక్రయించడంతో నగరపాలికకు నష్టం జరుగుతుందని కాలనీ కమిటీలు అంటున్నాయి. ఇవన్నీ అనధికారికంగానే ఉంటున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయి.

ముందస్తు చర్యల్లేకనే వివాదాలుప్రభుత్వానికి సంబంధించిన ఖాళీ స్థలాలు రూ.కోట్లు విలువ చేస్తుండగా ఆ స్థలాలపై ముందస్తు చర్యలు లేకపోవడం, దర్జాగా ఆక్రమణలకు పాల్పడుతుండటంతో వివాదాలు వస్తున్నాయి. కొంతకాలంగా నగర శివారులోని రెవెన్యూ పరిధిలోని భూములు కబ్జాలు అవుతున్నాయని పలు పార్టీల నాయకులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు ఉండటం లేదు. ఫలితంగా ఇప్పటికే కొన్ని చోట్ల కబ్జాలకు గురైందనే ఆరోపణలు లేకపోలేదు. ఆహ్లాదానికి స్థలం కరవునగరంలోని విలీన గ్రామాల్లో అత్యధిక చోట్ల అభివృద్ధి చేసేందుకు, పార్కులు నిర్మించేందుకు స్థలాలు లేకుండా పోయాయి.

# అశోక్‌బాబు తల్లి భౌతికకాయానికి సీఎం జగన్ నివాళులు



అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. కొండెపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. సోమవారం ప్రకాశం జిల్లా కారుమంచికి వెళ్లిన సీఎం జగన్.. అశోక్‌బాబు తల్లి భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, సీఎం వైఎస్ జగన్ సోమవారం ఉదయం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చేరుకున్నారు.

**28న విశాఖ పర్యటన** : 28వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి సీఎం వైఎస్ జగన్ బయలుదేరి 5.15 గంటలకు విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు రిషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌కు చేరుకుని రాత్రి 7-8 గంటల మధ్య జీ-20 ప్రతినిధులతో జరిగే ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అతిథులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'గాలా డిన్నర్'లో పాల్గొని రాత్రి 8.45 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 10 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

# ఒంటిమిట్ట శ్రీరామనవమి ఉత్సవాలు.. సీఎం జగన్‌కు టీటీడీ ఆహ్వానం



తాడేపల్లి : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తన నివాసంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలు కలిశాఉ. శ్రీకోదండరామస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికను సీఎం జగన్‌కు టీటీడీ చైర్మన్, ఈవోలు అందజేశారు. ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకూ శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవం జరగనుంది. అదే సమయంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 09 తేదీ వరకూ ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా సీఎం జగన్‌ను టీటీడీ చైర్మన్, ఈవోలు కలిసి ఆహ్వాన శుభ పత్రికను అందజేశారు.

# నిజం, ధైర్యం, త్యాగం.. ఇదీ మా వారసత్వం : రాహుల్ గాంధీ



ఎంపీగా అనర్హత వేటు పడిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ట్విట్టర్ బయోని 'డిస్ క్వాలిఫైడ్ ఎంపీ'గా మార్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా గాంధీ కుటుంబ వారసత్వం, బలాన్ని హైలెట్ చేస్తూ రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తన సోదరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మూడు దశాబ్దాల నాటి సంఘటనను వివరిస్తూ చేసిన ఆవేశభరిత ప్రసంగానికి సంబంధించిన వీడియోను పంచుకున్నారు. 2019 పరువు నష్టం కేసులో దోషిగా తేలిన రాహుల్ గాంధీపై లోక్‌సభ సెక్రటేరియట్ ఎంపీగా అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. రాహుల్‌పై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం దేశవ్యాప్తంగా 'సంకల్ప్ సత్యాగ్రహ' దీక్షలు చేపట్టింది. ఢిల్లీ లోని రాజ్‌ఘాట్ వద్ద చేపట్టిన దీక్షలో ప్రియాంక గాంధీ పాల్గొని మాట్లాడారు. తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అంత్యక్రియల సందర్భంగా ఆయన భౌతిక కాయాన్ని మోస్తూ రాహుల్ ఆర్మీ ట్రక్కు వెనుక నడిచిన సంఘటనను గుర్తు చేస్తూ ప్రియాం ఆవేశపూరిత ప్రసంగం చేశారు. '32 ఏళ్ల క్రితం, మా నాన్న (రాజీవ్ గాంధీ) మృతదేహం అంత్యక్రియల కోసం తీన్‌మూర్తి భవన్ నుంచి బయలుదేరుతోంది. మృతదేహాన్ని మోస్తూ రాహుల్ నడి ఎండలో ఆర్మీ ట్రక్కు వెనకే నడిచారు. అప్పుడు మా నాన్న మృతదేహానికి త్రివర్ణ పతాకం చుట్టారు. కానీ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మా నాన్నను మీరు అవమానించారు. ఇప్పుడు ఆ అమరవీరుడి కుమారుడిని దేశద్రోహి అంటున్నారు. అతని దేశభక్తిని ప్రశ్నిస్తున్నారు. నెహ్రూ ఇంటిపేరును ఈ కుటుంబం ఎందుకు ఉపయోగించలేదని పార్లమెంటులో ప్రధాని ఎద్దేవా చేశారు. అలా ప్రశ్నించి మీరు మా మొత్తం కుటుంబాన్ని, కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని అవమానించారు' అని ప్రియాంక పేర్కొన్నారు. ఈ వీడియో షేర్ చేసిన రాహుల్.. 'నిజం, ధైర్యం, త్యాగం – ఇది మా వారసత్వం. ఇదే మా బలం కూడా' అంటూ క్యాప్షన్ ఇచ్చారు.

# వామ్మో.. షాకింగ్స్ విషయాలు చెప్పిన యనమల



అమరావతి : మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు షాకింగ్ విషయాలను వెల్లడించారు. రాష్ట్ర అప్పు రూ.12.50 లక్షల కోట్లు దాటనుందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై రూ.5.50 లక్షల అప్పు భారం ఉంటుందన్నారు. అధిక అప్పుల వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. ఖర్చులకు ప్రభుత్వం సమాధానం చెప్పి తీరాలన్నారు. బడ్జెట్ అప్పు తీర్చేందుకే సరిపోతే ఇంకేం మిగులుతుందన్నారు. రాష్ట్రం అధోగతి పాలైందని కాగ్ నివేదిక స్పష్టం చేస్తోందన్నారు. పరిష్కారం కాదని.. జగన్ ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తోందని యనమల పేర్కొన్నారు.




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి విలేకరుల సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు. పాత్రికేయులు ఒకవైపు పలు ప్రశ్నలు సంధిస్తుంటే..అవేమీ తనకు కాదన్నట్టు వెనక్కి తిరిగి చూడకుండా గది నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇంతకీ విషయం ఏంటంటే..? అమెరికాలోని రెండు బ్యాంకుల్లో సంక్షోభం తలెత్తిన సంగతి తెలిసిందే. వీటి గురించి బైడెన్ మాట్లాడుతూ.. తమ బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగానే ఉందని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. డిపాజిటర్ల డబ్బుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో విలేకరులు పలు ప్రశ్నలు సంధించారు. 'అసలు ఈ సంక్షోభం ఎందుకు తలెత్తిందనే దానిపై మీ వద్ద ప్రస్తుతం ఉన్న సమాచారం ఏంటి..? దీని తదనంతర పరిణామాలు ఉండవని మీరు అమెరికన్లకు భరోసా ఇవ్వగలరా..? అని పశ్నించారు. ఇది విన్న వెంటనే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అధ్యక్షుడు బయటకు నడక ప్రారంభించారు. 'మరికొన్ని బ్యాంకులకు ఇలాంటి పరిస్థితే తలెత్తుందా..?' అని మరో ప్రశ్న ఎదురైంది. ఇదంతా తనకు సంబంధించిన విషయం కాదన్నట్టు వెనక్కి చూడకుండా బైడెన్ తన నడక కొనసాగించారు. ఆ సమావేశం జరుగుతున్న గది తలుపు వేసి, బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. బైడెన్ వ్యవహారశైలిపై నెట్టింట్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే విలేకరులు సమావేశం నుంచి ఆయన మధ్యలో వెళ్లిపోవడం ఇది తొలిసారేం కాదు. ఇటీవల చైనా నిఘా బెలూన్ ఘటనపై జరిగిన సమావేశంలోనూ ఇదే రీతిలో వ్యవహరించారు. 'చైనాలో ఉన్న మీ కుటుంబ వ్యాపారాల వల్ల దేశ భద్రత విషయంలో మీరు రాజీపడ్డారా..?' అనే ప్రశ్న ఎదురుకాగా.. 'నాకు కొంచెం బ్రేక్ ఇవ్వండి' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ నిఘా బెలూన్‌ను అమెరికా కూల్చివేసిన సంగతి తెలిసిందే. కాగా, బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ విదేశీ వ్యాపారాలపై విమర్శలు వినిపిస్తుంటాయి. తమ కుటుంబ వ్యాపారాలు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కలిగి ఉండవని ఇదివరకు అధ్యక్షుడు హామీ ఇచ్చారు. అయితే హంటర్‌కు స్కానియాటిలిస్ ఎల్‌ఎల్‌సీ ద్వారా చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని బీహెచ్‌ఆర్ పార్ట్నర్స్‌లో ఇంకా 10 శాతం వాటా ఉందని అమెరికన్ మీడియా సంస్థ ఒకటి కథనాన్ని ప్రచురించింది. 2021లో అందులోని వాటాలన్నింటిని ఆయన విక్రయించారని హంటర్ తరఫు న్యాయవాది వెల్లడించారు.

కానీ కొన్ని అనుమానిత లావాదేవీలపై మాత్రం సమాధానం ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. అమెరికాలో సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంకు మూతపడ్డాయి. సిలికాన్ వ్యాలీ బ్యాంక్ ఉదంతం ఇంకా ప్రకంపనలు సృష్టిస్తుండగానే.. క్రిప్టో పరిశ్రమతో ఎక్కువగా సంబంధాలున్న సిగ్నేచర్ బ్యాంక్‌ను మూసివేస్తున్నట్లు అక్కడి నియంత్రణ సంస్థలు ఆదివారం సాయంత్రం ప్రకటించాయి. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే అమెరికాలో ఇలా కీలక బ్యాంకులు మూతపడడంతో బ్యాంకింగ్ రంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.




**అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో ఈ నెల 24న జరిగిన వైకాపా ఆత్మీయ సమ్మేళనంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పూర్వం నుంచి తమ గ్రామం చింతలమోరికి ఓ బ్యాచ్ దొంగ ఓట్లు వేయడానికి వచ్చేవారని చెప్పారు. ఆ ఓట్లతో తన విజయానికి సహకరించేవారని వ్యాఖ్యానించారు. 15 నుంచి 20 మంది వచ్చి.. ఒక్కొక్కరూ 5 నుంచి 10కి పైగా ఓట్లు వేసేవారన్నారు. దీంతో తనకు 800పైనే మెజారిటీ వచ్చేదని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.**




దిల్లీ: పోలవరం ప్రాజెక్టు ఎత్తు అంశంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా వేర్వేరు ప్రకటనలు చేసింది. 1980 గోదావరి ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం.. పోలవరం పూర్తి నీటినిల్వ సామర్థ్యం ఎత్తు 45.72 మీటర్లుగా పేర్కొంది. నీటినిల్వ సామర్థ్యం 41.15 మీటర్లకి తగ్గించాలంటూ ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తమ వద్ద సమాచారం లేదని తెలిపింది.

ఈ మేరకు రాజ్యసభలో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అయితే, ఇటీవల పార్లమెంటులో వైకాపా ఎంపీ సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ స్పందిస్తూ.. పోలవరం మొదటి దశలో భాగంగా ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకే పరిమితమని తేల్చి చెప్పారు. దీనికి భిన్నంగా తాజాగా కేంద్రం మరో ప్రకటన చేయడం గమనార్హం. పోలవరం సవరించిన అంచనాలపైనా రాజ్యసభలో కేంద్రం సమాధానం ఇచ్చింది. సవరించిన అంచనాలపై ఒకే కమిటీ రెండు సిఫారసులు చేసిందని పేర్కొంది. సవరించిన అంచనాలను కేంద్రం చెల్లిస్తుందా? అని ఎంపీ కనకమేడల కేంద్రాన్ని అడిగారు. దీంతో పోలవరం ప్రాజెక్టు పురోగతి నివేదికను కేంద్రం సభముందు ఉంచింది. 2017-18 ధరల మేరకు సవరించిన అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా ఉందన్న కేంద్ర ప్రభుత్వం.. 2019లో తమకు వచ్చిన సవరించిన అంచనా వ్యయం రూ.55,548కోట్లు అని పేర్కొంది. వచ్చిన అంచనాలను జలశక్తి శాఖ సాంకేతిక సలహా కమిటీ అంగీకరించిందని చెప్పింది. ఆర్‌సీసీ అధ్యయనంలో అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా నిర్ధారణ అయినట్టు వెల్లడించింది. 2013-14 ప్రకారం అంచనా వ్యయం రూ.29,027 కోట్లుగా పేర్కొన్న కేంద్రం.. భూసేకరణ, పరిహారం, పునరావాస ఖర్చు వల్లే ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిందని తెలిపింది. రాష్ట్రం చేసిన ఖర్చులో ఇప్పటివరకు రూ.13,463కోట్లు ఇచ్చామని స్పష్టంచేసింది.




దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు నిలబడుతుందా లేదా అన్నదానిపై సందిగ్ధత కొనసాగుతున్న వేళ.. కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసులో జైలు శిక్ష పడి అనర్హతకు గురైన లక్షద్వీప్ మాజీ ఎంపీ మహమ్మద్ ఫైజల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ముందస్తు విచారణ చేపట్టాలని కోరగా.. సర్వోన్నత న్యాయస్థానం అందుకు అంగీకరించింది. ఫైజల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఓ హత్యాయత్నం కేసులో ఈ ఏడాది జనవరి 11వ తేదీన కవరత్తి సెషన్స్ కోర్టు ఫైజల్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో అదే నెల 13వ తేదీన ఆయనపై లోక్‌సభ సెక్రటేరియట్ అనర్హత వేటు వేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత ఆయన తన జైలు శిక్షను కేరళ హైకోర్టులో సవాల్ చేయగా.. అక్కడ ఆయనకు ఊరట లభించింది. దీంతో అనర్హత వేటుపై ఆయన ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు విధించిన శిక్షపై కేరళ హైకోర్టు స్టే విధించినా.. లోక్‌సభ సెక్రటేరియట్ తనపై అనర్హతను ఎత్తివేయలేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతి రోజు పార్లమెంట్‌కు వచ్చినా.. తనను భద్రతా సిబ్బంది సభ లోపలికి అనుమతించట్లేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తనపై లోకసభ సచివాలయం విధించిన అనర్హతను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. కాగా.. తన పిటిషన్‌పై వెంటనే విచారణ జరపాలని ఫైజల్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ధర్మాసనం వద్ద ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించింది. ఫైజల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టనున్నట్లు సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. రాహుల్ గాంధీపై అనర్హత సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ ఇంటి పేరును కించపర్చారన్న కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటంతో ఇటీవల ఆయనపై లోక్‌సభ సచివాలయం అనర్హత వేటు వేసింది. అయితే ఈ తీర్పుపై రాహుల్ ఇంకా పైకోర్టులో అప్పీలు చేయలేదు. అయితే ఫైజల్'అనర్హత' కేసు ఇంకా కొలిక్కి రాకపోవడంతో.. రాహుల్ అప్పీలుకు వెళ్తే ఏం జరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# నడిచి వచ్చే భక్తులకు దివ్యదర్శన టోకెన్లు.. తితిదే చైర్మన్



తిరుమల: ఏప్రిల్ 1 నుంచి నడిచి వచ్చే భక్తులకు దివ్య దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్టు తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. అలిపిరి నడక దారిలో రోజుకు 10వేల టోకెన్లు జారీ చేయనున్నట్టు తెలిపారు. సోమవారం తిరుమలలో వేసవి ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. శ్రీవారి మెట్టు నడకదారిలో రోజుకు 5వేల టోకెన్లు జారీ చేయనున్నట్టు తెలిపారు. వేసవిలో బ్రేక్ సిఫారసు లేఖలను తగ్గిస్తామన్నారు. ముఖ గుర్తింపుతో పారదర్శకంగా వసతి సౌకర్యం కేటాయింపులు చేయనున్నట్టు తెలిపారు. వేసవిలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. కరోనాకు ముందు నడిచి వచ్చే భక్తులకు దివ్యదర్శన టోకెన్లను తితిదే జారీ చేసిన విషయం తెలిసిందే. కరోనా సమయంలో వీటిని నిలిపివేసిన తితిదే.. తాజాగా మళ్లీ నడిచి వచ్చే భక్తుల కోసం దివ్యదర్శన టోకెన్లు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.

# కుర్చీలు లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి దగా చేశారు



శ్రీసత్యసాయి : నేడు యువగళం పాదయాత్రలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. వడ్డెర సామాజిక వర్గీయులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. వడ్డెర వృత్తి చేసుకునేందుకు గతంలో కేటాయించిన.. క్వారీలను సైతం వైసీపీ నేతలు కబ్జా చేశారని నారా లోకేశ్ పేర్కొన్నారు. కుర్చీలు లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి దగా చేశారన్నారు. అధికారంలోకి రాగానే వడ్డెరలకు పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. క్వారీలను తిరిగి వారికి అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పథకం కింద వడ్డెరలకు పనులు కేటాయిస్తామని లోకేశ్ వెల్లడించారు.




## చాలా సార్లు ఆ చేదు అనుభవం.. రకుల్ ఆవేదన

సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టాలి అనుకున్న అమ్మాయిలకు ఆరంభంలో చాలా అవమానాలు.. ఇబ్బందులు తలెత్తుతూ ఉంటాయి. ఇప్పుడు కాస్త పర్వాలేదు కానీ ఒకప్పుడు మరీ దారుణంగా హీరోయిన్ అవ్వాలి అనుకున్న అమ్మాయిలను వాడుకునే వారు. అవమానించే వారు అంటూ టాక్ ఉండేది. ఇప్పుడు ఇండస్ట్రీలో ఉన్న కొంత మంది హీరోయిన్స్ తమ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి చెప్తే ఆశ్చర్యం వేయక మానదు. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అప్పటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో చాలా సార్లు సినిమాల్లో ఎంపిక చేసుకుని కొన్నాళ్ల పాటు షూటింగ్ నిర్వహించి



చెప్పకుండానే తొలగించి మరో హీరోయిన్ తో షూట్ చేసేవారు. అలా చాలా సార్లు చేదు అనుభవం ఎదురయ్యిందని రకుల్ ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేసింది. ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన వాళ్లకు అవకాశాలు వచ్చినట్లే వచ్చి చేజారుతాయి అంటూ రకుల్ పేర్కొంది. ఆత్మ విశ్వాసంతో అడుగులు వేశాను కనుకే ఈ స్తాయికి నేను చేరుకున్నాను. ఎప్పుడు కూడా ఇండస్ట్రీ లో అవకాశాలు కానీ మరేదైనా కానీ ఈజీగా దొరకాలని నేను కోరుకోలేదు అంటూ రకుల్ పేర్కొంది. కొత్తగా వచ్చే అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించాలని ఆమె సూచించింది.

## అందాల లావణ్య సొగసు చూడతరమా

అందాల రాక్షసి ఫేం లావణ్య త్రిపాఠి హీరోయిన్ గా వరుస ఆఫర్లు దక్కించుకోలేక పోయినా కూడా సుదీర్ఘ కాలంగా కెరీర్ లో కొనసాగుతూ వస్తోంది. తెలుగు లేదా ఇతర భాషల్లో అప్పుడో ఇప్పుడో ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతోంది. గత ఏడాది హ్యాపీ బర్త్ డే అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లావణ్య త్రిపాఠి ప్రస్తుతం ఒకటి రెండు చిన్న సినిమాలు చర్చల దశలో ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి.

ఈ ఏడాదిలో ఒకటి రెండు సినిమాలతో అయినా లావణ్య త్రిపాఠి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సినిమాలు తక్కువ ఉన్నా కూడా



సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ప్రదర్శణ చేస్తూ.. క్యూట్ ఫొటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్న ముద్దుగుమ్మ లావణ్య త్రిపాఠి కి పాపులారిటీ మరింత పెరుగుతూనే ఉంది. తాజాగా ఈ క్యూట్ ఫొటోను షేర్ చేసిన లావణ్య త్రిపాఠి మరోసారి తన అభిమానుల దృష్టిని ఆకర్షించింది. స్కిన్ షో చేయకున్నా కూడా లావణ్య త్రిపాఠి యొక్క అందం గురించి మాట్లాడుకునే విధంగా ఉంటుంది. ఫుల్ లెంగ్త్ లెహంగాలో అందాల లావణ్య యొక్క సొగసు చూడతరమా అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## అది ఒళ్ళా.. విల్లా? అనుష్కా



రబ్ నే బనాదీ జోడీ అనే సినిమాతో అనుష్క శర్మ బాలీవుడ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో షారుఖ్ కు జోడిగా నటించింది. ఆ సినిమాలో ఆమె యాక్టింగ్ తో విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకుంది. దీంతో ఆమెకు వరుస సినిమాల ఛాన్స్ లు వచ్చాయి. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అనుష్క శర్మ... స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. అప్పటినుంచి వరుస సినిమాలు చేస్తూ... హవా చూపిస్తోంది. ఈ తరుణంలోనే టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లీతో ప్రేమలో పడింది. కొంతకాలం రహస్యంగా లవ్ ట్రాక్ నడిపిన ఈ జోడి... కొన్నేళ్ల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుని ఒకటయ్యారు. విరాట్ ను పెళ్లి చేసుకున్న తర్వాత కూడా అనుష్క శర్మ సినిమాల్లో నటించింది. అయితే 2021 లో ఈ జోడీ ఓ పాపకి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. వీరు పాపకు వామికా అని పేరు పెట్టారు. దీంతో ఆమె రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగానే ఉంటూ వచ్చింది. చాలా కాలం పాటు వరస సినిమాలు చేసిన అనుష్క శర్మ... కొంత కాలం ఖాళీగానే ఉంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటూ వస్తుంది. ఈ క్రమంలో తన వ్యక్తిగత సినీ కెరియర్ కు సంబంధించిన విషయాలను పంచుకుంటూ... ఫ్యాన్స్ ను పెంచుకునే పనిలో పడింది. తాజాగా తన శరీరాన్ని విల్లులా వంచి ఉన్న ఫోటోని ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసింది. దానికి పర్స్పెక్టివ్ అనే క్యాప్షన్ ఇచ్చింది. చూసిన ఫ్యాన్స్.. కామెంట్ బాక్స్ లో లవ్ సింబల్స్ వర్షాన్ని కురిపిస్తున్నారు. ఇక ఈ భామ త్వరలో సినిమాల్లో వచ్చేందుకు సిద్ధమవుతోంది.

## శ్రద్ధగా పరువాలన్నీ ఆరబోస్తున్న ముద్దుగుమ్మ




తెలుగు హీరోయిన్లుగా తెలుగు వారి కంటే ఎక్కువగా ఉత్తరాది వారే క్లిక్ అవుతూ ఉంటారు. అయితే అదే సెంటిమెంట్ని నమ్ముకుని చాలామంది ఉత్తరాది భామలు తెలుగు హీరోయిన్లుగా రాణించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ ఉంటారు. అలాంటి వారిలో శ్రద్ధ దాస్ కూడా ఒకరు. అల్లరి నరేష్ హీరో నటించిన సిద్దు ఫ్రం శ్రీకాకుళం అనే సినిమాతో హీరోయిన్గా మారిన ఈ భామ ఆ తర్వాత అనేక తెలుగు తమిళ కన్నడ మలయాళం సినిమాల్లో కూడా నటించింది. ఇవన్నీ కాక హిందీలో కూడా కొన్ని సినిమాల్లో నటించింది. అయితే ఇవేవీ ఆమెకు క్రేజ్ అయితే తీసుకురాలేకపోయాయి. ఎప్పటికప్పుడు ఒక మంచి ప్రాజెక్ట్ చేసి హీరోయిన్గా నిలదొక్కుకుందాం అని చేస్తున్న ప్రయత్నాలు.. ఆమెకి ఏమాత్రం ఫలించకపోవడంతో ఇక ఏ అవకాశం వచ్చినా కాదనకుండా చేసుకుంటూ వెళ్ళిపోతుంది. ఆ మధ్య ఒక బోల్డ్ వెబ్ సిరీస్లో కూడా కనిపించి ఒక్కసారిగా అందరికీ షాక్ ఇచ్చింది. ఇక అప్పటినుంచి అందాల ఆరబోతలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాను అన్ని రకాల పాత్రలకు సై అని హింట్ ఇచ్చే విధంగా ఆమె చేస్తున్న అంగంగా ప్రదర్శన ఇప్పుడు అందరికీ షాక్ ఇస్తోంది. తాజాగా శ్రద్ధాదాస్ ముంబైలో తన స్వగృహంలో టైం గడుపుతోంది. పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లిన ఆమె... తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ ఫోటోలో ఆమె వెస్ట్రన్ డ్రెస్ ధరించమే కాకుండా సంప్రదాయబద్ధంగా చీర కట్టుకొని కనిపించింది. అయితే ఆ చీరకట్టులో కూడా తన అందాలను బహిర్గతం చేసింది. అలా చీరలో తన అందాలను చూపిస్తూ... అభిమానులను టీజ్ చేస్తూ కనిపించింది. చీరకట్టులో తన బొడ్డును చూపిస్తూ రెచ్చిపోయింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆమె ధరించిన జాకెట్టు కూడా కాస్త భిన్నంగా ఉండడంతో ఆమె ఎద అందాలన్నీ బయటకి కనిపించేలా ఉన్నాయి. ఇక ఆమె పెట్టిన పోస్టు కేవలం మగ ఫ్యాన్స్ మాత్రమే కాదండోయ్... లేడీ ఫ్యాన్స్ కూడా ఈ హాట్ న్యూస్ తట్టుకోలేకపోతున్నాం బాబోయ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## పఠాన్ సెన్సార్ కట్స్ పై క్రేజీ హీరోయిన్ ఫైర్!

దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత షారుక్ ఖాన్ నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించాడు. దీపిక పదుకునే హీరోయిన్ గా నటించిన ఈ మూవీలో జాన్ అబ్రహం విలన్ గా నటించాడు. యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్ పై ఆదిత్య చోప్రా అత్యంత భారీ స్థాయిలో ప్రతీష్టాత్మకంగా నిర్మించిన సినిమా ఇది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ మూవీని జనవరి 25న అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. హిందీతో పాటు ఈ మూవీని తెలుగు తమిళ భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సెన్సార్ వారు సినిమా చూశారు. యు/ఏ సర్టిఫికెట్ ని ఇచ్చారు. రన్ టైమ్ ని కూడా కుదించారని తెలిసింది. 'పఠాన్' ఫైనల్ రన్ టైమ్ 146.16 (రెండు గంటల 26 నిమిషాల 16 సెకన్లు). ఇక సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన వైరల్ గా మారిన



'బేషరమ్ రంగ్' సాంగ్ పాటకు మూడు కట్స్ విధించారట. దీపిక పదుకునే అందాల ఆరబోతపై వచ్చిన విమర్శల్ని దృష్టిలో పెట్టుకున్న సెన్సార్ బోర్డ్ దీపిక గోల్డెన్ స్విమ్ సూట్ లో వున్న మూడు క్లోజప్ షాట్స్ కు కొన్ని డ్యాన్స్ మూవ్ మెంట్స్ లలో మార్పులు చేశారట. టోటల్ గా ఈ మూవీకి 10 కట్స్ విధించినట్టుగా తెలుస్తోంది. అంతే కాకుండా పలు సంభాషణల్లోనూ సూచనలు చేసినట్టుగా చిత్ర బృందం తెలిపింది. రిలీజ్ సమయానికి సెన్సార్ వారు చెప్పిన మార్పులతో సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ వెల్లడించారు. సినిమా రిలీజ్ కు మరో నాలుగు రోజులే వుండటంతో చిత్ర బృందం ప్రమోషన్స్ ని స్పీడప్ చేసింది. ఇక దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ సినిమాలో వున్న యాక్షన్ ఘట్టాలపై ఈ సందర్భంగా వెల్లడించాడు. పఠాన్ లోని యాక్షన్ ఘట్టాలు ఒళ్లు గగుర్పొడిచే విధంగా వుంటాయని అవి వెండితెరపై చూస్తే అద్భుతంగా అనిపిస్తాయన్నాడు. అయితే ఈ మూవీ సెన్సార్ వారు 10 కట్స్ విధించడంపై హీరోయిన్ శ్రేయాస్ ధన్వంతరీ తీవ్రంగా స్పందించింది. ఇది హాస్యాస్పదంగా వుందని సెన్సార్ సభ్యులపై తీవ్ర స్థాయిలో మండిపడింది. మా అద్భుతమైన ప్రేక్షకులకు వారు ఏమి చూడాలనుకుంటున్నారో నిర్ణయించే శక్తిని ఇవ్వండి. వారికి ఏదైతే నచ్చకపోతే వారే టికెట్ లు కొనరు. ఈ హాస్యాస్పదమైన సెన్సార్ షిప్ ని ఆపేయండి' అంటూ శ్రేయాస్ ధన్వంతరి సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ఫైర్ అయింది.

## సీనియర్ స్టార్ హీరోయిన్ కూతురు తెరంగేట్రం సూపర్ అప్డేట్

బాలీవుడ్ ప్రేక్షకులతో పాటు సౌత్ సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన రవీనా టాండన్ ఇప్పటికి కూడా మంచి ఫాలోయింగ్ ను కలిగి ఉన్న విషయం తెల్సిందే. రవీనా టాండన్ కు పెద్ద కూతురు ఉంది అనే విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఇంకా మూడు పదుల వయసులో ఉన్నట్లుగా రవీనా టాండన్ కనిపిస్తూ ఉంటుంది. రవీనా టాండన్ యొక్క కూతురు రాషా టాండన్ అతి త్వరలోనే ఇండస్ట్రీలో అడుగు పెట్టబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. గత రెండు సంవత్సరాలుగా హీరోయిన్ గా పరిచయం అవ్వడానికి కావాల్సిన కసరత్తులను రాషా టాండన్ చేస్తోంది. రాషా టాండన్ ఇప్పటికే కొన్ని కథలు విన్నదని.. ఆమె హీరోయిన్ గా ఎంట్రీ



ఇవ్వబోతున్న సినిమా కన్ఫర్మ్ అయ్యిందని వార్తలు వస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం సుశాంత్ సింగ్ రాజ్ పూత్ మరియు సారా అలీ ఖాన్ జోడీగా నటించిన కేదార్నాథ్ సినిమా యొక్క దర్శకుడు అభిషేక్ కపూర్ దర్శకత్వంలో రాషా టాండన్ హీరోయిన్ గా పరిచయం కాబోతుందట.

ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభం అయ్యిందని తెలుస్తోంది. బాలీవుడ్ నుండి వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ముద్దుగుమ్మ ఎంట్రీ ఇవ్వబోతున్న సినిమాలో స్టార్ హీరో అజయ్ దేవగన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడట. మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటీ అంటే ఇదే సినిమా తో ఆమన్ దేవగన్ ను పరిచయం చేయాలని కూడా భావిస్తున్నారట. ఈ ఏడాది సమ్మర్ వరకు ఈ సినిమాపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




# కవిత పిటిషన్‌ను నళినీ చిదంబరం పిటిషన్‌కు జత చేసిన సుప్రీం

ఢిల్లీ : ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూడు వారాల పాటు వాయిదా వేసింది. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో గతంలో దాఖలు చేసిన నళినీ చిదంబరం పిటిషన్‌కు సుప్రీంకోర్టు ట్యాగ్ చేసింది. కవిత తన పిటిషన్‌లో సరికొత్త అభ్యర్థన చేశారు. మద్యం పాలసీ కేసు విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌధురి కవిత తరఫున వాదనలు వినిపించారు. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఈడీ కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ తనకు పీఎంఎల్‌ఏ చట్టంలోని సెక్షన్ 50 ప్రకారం జారీచేసిన నోటీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 160కి విరుద్ధంగా ఉన్నాయని, వాంగ్మూలం నమోదు చేసేప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కవిత ఆ పిటిషన్‌లో కోరారు. తన ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, జారీ చేసిన జప్తు నోటీసులను రద్దు చేయడంతో పాటు.. ఫోన్‌ను సీజ్ చేయడం చెల్లదని ఆదేశాలు ఇవ్వాలని, ఈ పిటిషన్‌ను నళినీ చిదంబరం వర్సెస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు జత చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తొలుత శుక్రవారం విచారణ జరుపుతామని చెప్పినా.. ఆ తర్వాత తదుపరి విచారణ తేదీని 27గా ప్రకటించింది. కాగా.. కవిత ఇప్పటికే ఈడీ ఎదుట మూడుసార్లు హాజరై.. తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. సాక్షిగా పిలిచిన మహిళను తమ ఇంటి వద్ద లేదా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని పిటిషన్‌లో కవిత కోరారు.

సీఆర్పీసీ సెక్షన్ 160ని ఉల్లఘించి... తనని ఈడీ కార్యాలయానికి పిలిచి విచారిస్తున్నారని కవిత పేర్కొన్నారు. విచారణ సందర్భంగా... ఈడీ అధికారులు మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. గతంలో పలు ఉదాహరణలు ఉన్నాయని కవిత తెలిపారు. ఈడీ అధికారులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసిందని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈడీ అధికారులు కొంత మంది నిందితుల పట్ల ప్రవర్తించిన తీరు తనని ఆందోళనకు, భయానికి గురి చేస్తోందని తెలిపారు. న్యాయవాదుల సమక్షంలో, సీసీ టీవీ కెమెరాల నిఘాల్లోనే విచారణ చేపట్టేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కవిత దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ అజయ్ రాస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం పై విచారణ చేపట్టింది.

# భాజపా నేతలతో వేదికపై బిల్కిస్‌బానో దోషి.. కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

హైదరాబాద్ : భాజపా అంటే.. బలాత్కార్ జస్టిఫికేషన్ పార్టీ అంటూ తెలంగాణ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. బిల్కిస్ బానో కేసు దోషులతో భాజపా నేతలు సన్నిహితంగా ఉండటం ఆ పార్టీ విధానాలను తెలియజేస్తుందని కేటీఆర్ ట్విటర్‌లో విమర్శించారు. బిల్కిస్ బానో దోషులు విడుదలైనప్పుడు వారిని భాజపా నేతలు సత్కరించి సంబరాలు చేసుకున్నారని.. ఇప్పుడు వారు భాజపా ప్రజాప్రతినిధులతో వేదికను పంచుకుంటున్నారని ఓ నెటిజన్ పెట్టిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ కేటీఆర్.. కాషాయ పార్టీపై ధ్వజమెత్తారు. గుజరాత్‌లో శనివారం జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో భాజపా ప్రజాప్రతినిధులతో కలిసి బిల్కిస్ బానో కేసు దోషుల్లో ఒకరైన శైలేష్ చిమన్‌లాల్ భట్ పాల్గొన్నాడు. దాహోద్ జిల్లా కర్మాడి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతడు భాజపా ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి వేదికపై ఉన్నాడు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కూడా అతడు పాల్గొన్నాడు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఎంపీ, ఎమ్మెల్యే సోషల్ మీడియాలో పంచుకోగా అవి



వైరల్‌గా మారాయి. ఇప్పుడు కేటీఆర్ ట్విటర్‌లో ఈ ఫొటోలనే ప్రస్తావించి ఆ పార్టీపై వ్యంగాస్త్రాలు సంధించారు. బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులను గత ఏడాది ఆగస్టు 15 సందర్భంగా గుజరాత్ ప్రభుత్వం రెమిషన్‌పై విడుదల చేయగా.. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయిన విషయం తెలిసిందే. వీరి విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

# రోడ్డెక్కిన 'లహరి' బస్సులు.. ఏపీ రూట్లు, టికెట్ ధరలెంతనే ముచ్చట ఇది..




హైదరాబాద్ : టీఎస్ఆర్టీసీ తొలిసారిగా ప్రయాణికుల కోసం ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రైవేటు బస్సులకు దీటుగా ఆధునిక హంగులతో కూడిన 16 ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టింది. ఈ బస్సులకు 'లహరి-అమ్మఒడి అనుభూతి'గా నామకరణం చేసింది. సోమవారం నుంచి ఈ కొత్త బస్సులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరుల సమక్షంలో ఈ బస్సులను టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కర్ణాటకలోని బెంగళూరు, హుబ్బళ్లిబీ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తిరుపతిబీ తమిళనాడులోని చెన్నై తదితర ప్రధాన మార్గాల్లో నూతన ఏసీ స్లీపర్ బస్సులను టీఎస్ఆర్టీసీ నడపనుంది. 12 మీటర్ల పొడవు గల ఏసీ స్లీపర్ బస్సుల్లో లోయర్ 15, అప్పర్ 15తో మొత్తం 30 బెర్తులు ఉంటాయి. ఈ బస్సుల్లో ఉచిత వై-ఫై సదుపాయం అందుబాటులో ఉంది. మొబైల్ చార్జింగ్ సౌకర్యంతో పాటు ప్రతి బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్ ఉంటుంది. ప్రయాణికుల భద్రతకు బస్సుల్లో సెక్యూరిటీ కెమెరాలతో పాటు రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా సైతం అందుబాటులో ఉంది. అత్యాధునికమైన ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టం (ఎఫ్‌డీఏఎస్) ఏర్పాటు చేశారు. బస్సులో మంటలు చెలరేగితే వెంటనే ఇది అప్రమత్తం చేస్తుంది. ఇక ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు వీలుగా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉంది. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు గాను ఆర్టీసీ ఇటీవలే 630 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ 8 బస్సులను, నాన్ ఏసీ స్లీపర్ 4 బస్సులను ప్రవేశపెట్టింది. నూతనంగా ప్రారంభించిన ఈ బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని అధికారులు తెలిపారు.

**ఈ లహరి బస్సుల్లో టికెట్ ధరలు ఇలా ఉన్నాయి..** మియాపూర్-బెంగళూరు- రూ. 1630. ఎంజీబీఎస్-బెంగళూరు- రూ. 1580. మియాపూర్-హుబ్బళ్లి- రూ. 1510. ఎంజీబీఎస్-హుబ్బళ్లి- రూ. 1460. బీహెచ్ఈఎల్-విశాఖపట్నం- రూ. 1920. ఎంజీబీఎస్-విశాఖపట్నం- రూ. 1860. బీహెచ్ఈఎల్-తిరుపతి- రూ. 1750. ఎంజీబీఎస్-తిరుపతి- రూ. 1690. బీహెచ్ఈఎల్-చెన్నై- రూ. 1910. ఎంజీబీఎస్-చెన్నై- రూ. 1860.

# టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు: కాసాని

హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీ 41 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 29న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు 12 కమిటీలను నియమించినట్లు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 వేల మందికి పైగా ప్రతినిధులు, నేతలు హాజరవుతున్నట్లు చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, అరవింద్ కుమార్ గౌడ్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాసాని మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి ఏపీ పార్టీతో కలిసి సంయుక్తంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. తెలంగాణలో ప్రజల మద్దతు కూడగట్టేందుకు 93 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ పేరుతో చేపట్టిన కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చిందని చెప్పారు. వేడుకల కోసం గ్రేటర్ హైదరాబాద్ అంతటా భారీగా స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పార్టీ నేతలకు సూచించారు. ఎన్టీఆర్ ఘాట్‌ను సుందరంగా అలంకరించాలన్నారు.




ఢిల్లీ: ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్ వేదికగా శని, ఆదివారాల్లో జీ-20 రహస్య సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశానికి చైనా దూరంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమావేశానికి చైనా ప్రతినిధులు హాజరుకాలేదని అరుణాచల్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అరుణాచల్ రాజధాని ఈటానగర్‌లో శని, ఆదివారాల్లో ఈ సమావేశం జరిగింది. ఇందులో భారత అధికారులతో పాటు జీ-20 దేశాలకు చెందిన దాదాపు 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే, చైనా నుంచి ఒక్క ప్రతినిధి కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదని సదరు అధికారి పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని చాలా గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. మీడియా కవరేజ్‌కు కూడా అనుమతినివ్వలేదు. అయితే, సమావేశం తర్వాత ఆ ఫొటోలను అరుణాచల్ ప్రభుత్వ మీడియా ప్రతినిధి ట్విటర్‌లో షేర్ చేశారు. అరుణాచల్ ప్రదేశ్ టిబెట్‌లో భాగమని చైనా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే డ్రాగన్ వ్యాఖ్యలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. అరుణాచల్ తమ అంతర్భాగమేనని చైనాకు స్పష్టం చేసింది.

ఈ క్రమంలోనే అరుణాచల్‌లో జరిగిన జీ-20 సమావేశాలకు చైనా దూరంగా ఉండటం చర్చనీయాశంగా మారింది. అయితే దీనిపై ఇటు భారత విదేశాంగ శాఖ గానీ.. అటు చైనా గానీ ఇంతవరకూ అధికారికంగా స్పందించలేదు. అంతేగాక, ఈ సమావేశంపై చైనా అధికారికంగా అభ్యంతరాలు లేవనెత్తిందా లేదా అనేదానిపై కూడా స్పష్టత లేదు. జీ-20 బృందానికి ఈ ఏడాది భారత్ అధ్యక్షత వహిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబరులో ఢిల్లీ వేదికగా జీ-20 దేశాధినేతల ప్రధాన సదస్సు జరగనుంది. ఆ భేటీకి ముందు దేశవ్యాప్తంగా 50 ప్రధాన నగరాల్లో పలు రంగాలు, అంశాలపై జీ-20 సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే 'రీసెర్చ్ ఇన్నోవేషన్ ఇనిషియేటివ్' అనే అంశంపై ఈటానగర్‌లో రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించారు.

# సీపీఆర్‌పై 98 శాతం మందికి అవగాహన లేదు: మంత్రి హరీశ్‌రావు




హైదరాబాద్: దేశంలో రోజుకి నాలుగు వేల మంది సడన్ కార్డియాక్ అరెస్టుతో చనిపోతున్నారని, ప్రతి ఏడాది సుమారు 15 లక్షల మంది ఈ కారణంతో ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన CPR శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. సడన్ కార్డియాక్ అరెస్టుకు, హార్ట్ ఎటాక్‌కు మధ్య తేడా ఉందని చెప్పారు. మనిషి అప్పటికప్పుడు కుప్పకూలడమే కార్డియాక్ అరెస్ట్ అని, అప్పుడు చేసేదే సీపీఆర్ అని ఆయన తెలిపారు. అయితే, ఈ సీపీఆర్‌పై అవగాహన కేవలం 2 శాతం మందికే ఉందని, 98 శాతం మందికి అవగాహన లేకపోవడంతో చాలామంది కార్డియక్ అరెస్టుతో చనిపోతున్నారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అందుకే ఇప్పుడు కార్డియాక్ అరెస్టుపై అవగాహన కలిపిస్తున్నామన్నారు. సీపీఆర్ చేయడానికి పెద్ద చదువు అవసరం లేదని, అవగాహన ఉంటే చాలని చెప్పారు. EMR నుంచి శిక్షణ ఇచ్చి వారిని జిల్లాలకు పంపుతున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. సీపీఆర్ కాకుండా AED పరికరంతో కరెంట్ షాక్ ఇచ్చి కూడా సడన్ కార్డియాక్ అరెస్టు అయిన వారికి ట్రీట్‌మెంట్ చేస్తారని మంత్రి తెలిపారు. అయితే సీపీఆర్ అయినా, షాక్ ట్రీట్‌మెంట్ అయినా కేవలం 5 నుంచి 10 నిమిషాల్లో జరగాలని చెప్పారు. రాష్ట్రంలో రూ. 1500 కోట్లతో 1200 AED మిషన్లను కొనాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మారిన ఆహారపు అలవాట్లవల్ల కార్డియాక్ అరెస్టులు పెరిగాయని, కరోనా తర్వాత కూడా ఇవి ఎక్కువ సంభవిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా CPR పై అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో మంత్రి హరీష్ రావుతోపాటు, జిల్లా కలెక్టర్ హరీష్, జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, పోలీస్, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీని ఓడించేందుకే బీఆర్‌ఎస్‌కు మద్దతిస్తున్నాం: సీపీఎం కార్యదర్శి తమ్మినేని

నల్లగొండ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సీపీఎం తిప్పికొడుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి గద్దెదించడమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు సాగుతుందని చెప్పారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ శక్తులను వ్యతిరేకిద్దాం, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామనే సంకల్పంతో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర నల్లగొండకు చేరుకుంది. ఇందులో భాగంగా కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా, ఆ పార్టీని ఓడించేందుకే తాము బీఆర్ ఎస్‌కు మద్దతిస్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు మద్దతు కొనసాగిస్తామని, సీఎం కేసీఆర్‌సూచనలతో ముందుకు సాగుతామన్నారు. భవిష్యత్తులో బీజేపీని వ్యతిరేకించే పార్టీల ను కలుపుకొని బలమైన పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని పిలుపునిచ్చారు. మోదీని గతింపడమే లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తాయన్నారు. వ్యవసాయాన్ని నాశనం చేసేలా బీజేపీ ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. దానికి వ్యవసాయ చట్టాలే నిదర్శనం అన్నారు. వాటిని రద్దు చేయాలని బలమైన పోరాటం సాగడంతోనే



కేంద్రం వెనకకు తగ్గిందన్నారు. కేంద్రంలో మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ వారు సాగించిన పాలనని చూస్తామని, ఇది ఎంతో ప్రమాదకరమన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని స్పష్టంచేశారు. బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముకుంటున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం 8 సంవత్సరాల కాలంలో రూ. 100 లక్షల కోట్ల అప్పులను చేసిందని వెల్లడించారు.

# నల్ల దుస్తుల్లో విపక్ష ఎంపీల ప్రదర్శన.. లోక్‌సభ స్పీకర్‌పై ప్లకార్డులు, పేపర్లు విసిరేశారు




న్యూఢిల్లీ: రాహుల్ గాంధీపై అనర్హత వేటు విధించడాన్ని నిరసిస్తూ.. ఇవాళ విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్లమెంట్ ఉభయసభల్లోనూ విపక్ష ఎంపీలు ప్లకార్డులను ప్రదర్శించారు. లోక్‌సభలో కొందరు ఎంపీలు స్పీకర్ ఓం బిర్లా చైర్‌ను ముట్టడించారు. స్పీకర్ చైర్‌పై పేపర్లు చించి విసిరేశారు. ప్లకార్డులను కూడా విసిరేశారు. అయితే ఆందోళనల మధ్యలోనే స్పీకర్ బిర్లా సభను వాయిదా వేశారు.

# కేపీహెచ్‌బీలో ఓయో రూమ్‌లపై పోలీసుల మెరుపు దాడులు.. పోలీసులకు కనిపించిన దృశ్యాలివి..

హైదరాబాద్: కేపీహెచ్?బీలోని పలు ఓయో రూమ్‌లపై బాలానగర్ ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. 9 మంది యువతులను పోలీసులు రక్షించారు. కొన్ని రూమ్స్‌లో ప్యాకెట్ల కొద్దీ కండోమ్స్ కనిపించడం గమనార్హం. పబ్‌లు, లాడ్జీలపై పోలీసుల నజర్ పెరడగంతో జల్సారాయుళ్లు రూటు మార్చారు. నగర శివార్లలో ఉండే గెస్ట్, ఫాంహౌసులు, ఓయో రూములను అడ్డాగా మార్చుకొని పేకాట, హుక్కా, మద్యం సేవించడం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు ఓయో రూములు, లాడ్జీలు, ఫామ్‌హౌసులు, పబ్‌లు, దాబాలపై మెరుపుదాడులు నిర్వహిస్తూ చెమటలు పట్టిస్తున్నారు. సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు గత శనివారం రాత్రి కూడా 8 ఓయో లాడ్జీలు, 11 ఫామ్‌హౌస్‌లు, 6 పబ్‌లు, 14 దాబాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారితో పాటు నిర్వాహకులను కూడా అరెస్ట్ చేశారు. పేట్ బషీరాబాద్‌లోని లక్ష్మీ విల్లా గెస్ట్‌హౌస్‌లో గంజాయి సేవిస్తున్న పలువురిని గుర్తించి వారితో పాటు నిర్వాహకులను అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీలోని హోటల్ కార్తికేయ రెసిడెన్సీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి, ఓ యువతిని కాపాడి, కస్టమర్‌ను అరెస్ట్ చేశారు. షామీర్‌పేటలోని జాస్మిన్ ఫాంహౌస్‌లో గంజాయి సేవిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనుమతి లేకున్నా.. హుక్కా, మద్యం సేవించేందుకు అనుమతించిన శంషాబాద్‌లోని అక్రియేషన్ ఫామ్‌హౌస్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, హుక్కా ఫ్లేవర్లు, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మొయినాబాద్‌లోని బ్రౌన్‌టౌన్ రిసార్ట్ మ్యాంగో వుడ్ ఫాంలో మహిళలతో ముజ్రా పార్టీ, మద్యం, హుక్కా సేవిస్తున్న పలువురిని అరెస్ట్ చేసి, ఫాం నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ముజ్రా పార్టీలో 17 మంది యువకులు, నలుగురు యువతులను గుర్తించారు. వారి నుంచి కండోమ్‌లు, 100 గ్రాముల గంజాయి, గంజాయి నింపిన సిగరెట్లు, 11 హుక్కాపాట్‌లు, 10 హుక్కా పైపులు, హుక్కాఫ్లేవర్లు, సిల్వర్ పేపర్లు, మద్యం బాటిళ్లతోపాటు 7 కార్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com